17వ
సూర్య
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా
ఆదివారం,11 ఫిబ్రవరి 2024


## జగన్ రెడ్డి అరాచక పాలనపై పూరించిన నాధమే శంఖారావం - కొండబాబు



**కాకినాడ, మేజర్ న్యూస్ :** వైసీపీ ప్రభుత్వ అరాచకాలపై, జగన్ రెడ్డి సాగిస్తున్న నిరంకుశ పాలనపై తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ బాబు పూరించిన నాధమే శంఖారావం కార్యక్రమం అని కాకినాడ సిటీ మాజీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు పేర్కొన్నారు.

కొండబాబు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ అరాచక పాలనపై నారా లోకేష్ రాష్ట్రవ్యాప్తంగా యువగళం పాదయాత్ర నిర్వహించి ప్రజా సమస్యలపై పోరాటం చేయడం జరిగిందని, నేడు శంఖారావం కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గాలలో పర్యటించి జగన్ రెడ్డి ప్రభుత్వ దౌర్జన్యాలపై ప్రశ్నిస్తూ, రాష్ట్రంలో నిరుద్యోగ యువత పడుతున్న ఇబ్బందులు, వైసిపి ప్రభుత్వం పెంచిన నిత్యావసర ధరలతో రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులపై, రాష్ట్ర ప్రజలకు భరోసా కల్పిస్తూ నారా లోకేష్ శంఖారావం చేపట్టనున్నారని, రానున్న 50 రోజుల్లో 120 అసెంబ్లీ నియోజకవర్గాల్లో రోజుకు 3 అసెంబ్లీ నియోజకవర్గాల్లో శంఖారావం కార్యక్రమం ద్వారా ఆయా ప్రాంతాల్లో పర్యటించి స్థానిక ప్రజా సమస్యలపై పోరాడుతూ, బాబు హామీ - భవిష్యత్తుకు హామీ సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి, జగన్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలు, అరాచక పాలనపై గొంతెత్తి రాష్ట్ర ప్రజలకు మద్దతుగా నిలిచి, అన్ని వర్గాల ప్రజలకు భరోసా కల్పించి, క్షేత్ర స్థాయిలో తెలుగుదేశం పార్టీ శ్రేణులతో సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు.

## హక్కుతో కూడిన ఇళ్ల స్థలం

# ప్రభుత్వ లక్ష్యం

- ఇళ్ల స్థలాల పంపిణీలో కలెక్టర్ డాక్టర్ కృత్తికా శుక్లా
- 2,812 మందికి స్థలాలు పంపిణీ చేసిన రూరల్ ఎమ్మెల్యే కన్నబాబు
- లబ్ధిదారుల్లో వెల్లివిరిసిన సంతోషం
- పాల్గొన్న ఎమ్మెల్సీ, కౌడా చైర్పర్సన్, జెసి, కమిషనర్, ఇతర అధికారులు





**కాకినాడ,మేజర్‌న్యూస్ ప్రతినిధి :**

నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకంలో అర్హత కలిగిన ప్రతి ఒక్క మహిళకు సంపూర్ణ హక్కుతో కూడిన ఇళ్ల స్థలాన్ని ఇవ్వాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని కాకినాడ జిల్లా కలెక్టర్ డాక్టర్ కృత్తికా శుక్లా పేర్కొన్నారు. స్థానిక జేఎన్టీయూకే సమీపంలో శనివారం కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలోని ఎనిమిది రూరల్ డివిజన్లకు సంబంధించిన 2812 మందికి ఇళ్ల స్థలాల పంపిణీ ప్రక్రియ పండుగ వాతావరణంలో జరిగింది. మాజీ మంత్రి, కాకినాడ రూరల్ శాసనసభ్యులు కురసాల కన్నబాబు లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు. తొలుత కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ కృత్తికా శుక్ల, ఎమ్మెల్యే కన్నబాబు, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళ దీప్తి, జాయింట్ కలెక్టర్ సివి ప్రవీణ్ ఆదిత్య, నగరపాలక సంస్థ కమిషనర్ జే.వెంకటరావు, ఎడిసి సిహెచ్ నాగ నరసింహారావు, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్

- తరువాయి 2లో..

## శృంగార వల్లభుని దర్శనానికి శ్రీనివాసుడు

- జేజేలు పలికిన భక్తులు - కన్నుల పండుగగా శ్రీనివాస కళ్యాణం





**కాకినాడ, మేజర్ న్యూస్ ప్రతినిధి :** ఒక దేవుడిని మరో దేవుడు దర్శించుకోవడానికి వచ్చాడా..నిజంగా దేవుడు దేవేరులతో కలసి వచ్చారా అన్నట్లు సన్నివేశం ఆవిష్కృతమైంది. మాఘమాసం మొదటి రోజు కావడంతో ఈ అపురూప అద్భుత సంఘటన జరిగిందా అంటూ భక్తులు చర్చించుకున్నారు. ఒక దేవుడి ఆలయానికి మరో దేవుడు రావడంతో భక్తులు దండాలు పెట్టారు. ఆశ్చర్య చకితులయ్యారు. ఈ సంఘటన శనివారం కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం తొలి తిరుపతిలో జరిగింది.తొలి తిరుపతిలో శృంగార వల్లభస్వామి స్వయంభుగా కొలువుదీరారు. ఈ స్వామివారు అత్యంత మహిమాన్వితులు. ప్రతి శనివారం వేల సంఖ్యలో భక్తులు వస్తారు. మాఘమాసం మొదటి రోజు కావడంతో భక్తుల సంఖ్య మరింత పెరిగింది. ఈ నేపథ్యంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆలయ కార్యనిర్వహణ అధికారి వడ్డి శ్రీనివాసరావు ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక సంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసారు. శ్రీ అలివేలుమంగా పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామివారి దృశ్య రూపాన్ని ప్రదర్శింపజేశారు. నిజంగా వెంకటేశ్వరస్వామి అలివేలుమంగా పద్మావతి దేవి సమేతంగా అక్కడికి విచ్చేసారా అన్న విధంగా ఆ పరిసరాలు మారిపోయాయి. భక్తులు వారికి పొర్లు దండాలు పెట్టారు. పాదాభివందనాలు చేశారు. ఏడుకొండల స్వామివారే స్వయంగా ఈ ఆలయానికి వచ్చారంటూ ఆశీస్సులు తీసుకున్నారు. దాదాపు గంటసేపు వారు ఈ కళ్యాణ ఘట్టాన్ని ప్రదర్శించారు.

అనంతరం సాధారణ భక్తుల తరహాలోనే ఆ కళాకారులు కూడా క్యూలైన్లో వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. నిజంగా చూసేవారికి కన్నుల పండుగలా కనబడింది.

స్వామివారు దేవేరులతో కలిసి రావడం చూసి అటు శృంగారం వల్లభుడిని చూడాలా .. ఇటు వెంకటేశ్వర స్వామిని చూడాలా అన్న ఆశ్చర్యానికి గురయ్యారు. నిజంగా ఈ సన్నివేశం అందరినీ కట్టి పడేసింది. అభివర్ణించడానికి మాటలు సరిపోవు. చూసేందుకు రెండు కళ్ళు సరిపోవు అన్న చందాన ఈ అపురూప ఘట్టం ఆలయంలో చోటుచేసుకుంది .అప్పటికే దర్శనం చేసుకుని బయటకు వెళ్లిన భక్తులు ఈ విషయం తెలుసుకుని తిరిగి లోపలికి వచ్చారు. అక్కడే శృంగారవల్లభుని మరోసారి దర్శించుకుని అలివేలుమంగా పద్మావతి సమేత శ్రీనివాసుని వేషధారణలో ఉన్న ఆ ముగ్గురిని చూసి ప్రణామాలు చేశారు. ఈవో, చైర్మన్‌లను అభినందించారు. నిజంగా దేవుని గుడికి దేవుడే వచ్చినట్లుగా ఈ సంఘటన చోటుచేసుకుంది.

## ఈ-పంట, రైతు ఈకేవైసి ప్రక్రియ పరిశీలించిన జిల్లా వ్యవసాయ అధికారి



**అల్లవరం, మేజర్ న్యూస్ :** తాడికోన మరియు గుడాల గ్రామాల్లో ఈ-పంట నమోదు మరియు రైతు ఈకేవైసి ప్రక్రియను జిల్లా వ్యవసాయ అధికారి వి.బోసుబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లవరం మండలంలో ఇప్పటి వరకు 4,200 ఎకరాల్లో వరి నాట్లు పూర్తి అవ్వగా 4,000 ఎకరాల్లో ఈ పంట నమోదు పూర్తి అయిందని అన్నారు. ఈ పంట నమోదు ప్రక్రియను ఫిబ్రవరి 15వ తేదీ లోపు పూర్తి చెయ్యాలని సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. వరి పంట సాగుచేస్తున్న ప్రతి రైతు ఈ-పంట మరియు ఈకేవైసి తప్పనసరిగా చేసుకోవాలని రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ఎన్.వి.వి. సత్యనారయణ, గ్రామ వ్యవసాయ సహాయకులు సి.హెచ్. రంజిత్ స్వామి, ఎస్.కె. బిలాల్, రైతులు దాసరి విజయ్ కుమార్, సబ్బతి సత్తిరాజు, పట్టెం నాగ భూషణ, పులిమే కృష్ణ మొదలగువారు పాల్గొన్నారు.

## టూరిజం శాఖ ద్వారా వివిధ అభివృద్ధి పనులుకు నిధులు మంజూరు చేయండి

- ఎంపి వంగా గీతా విశ్వనాథ్



**కాకినాడ, మేజర్ న్యూస్ :** కేంద్ర టూరిజం, పురావస్తు, పర్యాటక మరియు కల్చర్‌శాఖ మంత్రి కిషన్ రెడ్డి ని కాకినాడ ఎంపి వంగా గీతా విశ్వనాథ్ కలిసి టూరిజం శాఖ ద్వారా వివిధ అభివృద్ధి పనులుకు నిధులు మంజూరు చేయవలసిందిగా కోరారు.పిఠాపురం నియోజకవర్గంలో ఉప్పాడ కొత్తపల్లి వద్ద నిర్మాణంలో వున్న హెూటల్ మేనేజ్మెంట్ డిగ్రీ మరియు డిప్లమో కోర్సులతో కాలేజీ కేంద్ర పర్యాటక విభాగం ద్వారా రూ.12 కోట్లు తో మంజూరు అయ్యి సుమారు రూ.6 కోట్లు పనులు పూర్తి అయినందున నిధులు మంజూరు చేయాలని కోరారు. అదేవిధంగా విద్యార్థినీవిద్యార్థులకు డిప్లమో కోర్సులు క్లాసులు ప్రారంభించాలని కోరారు. అన్నవరం ప్రసాద్ స్కీమ్ మొదటివిడత నిధులు మంజూరు చేయాలని, పనులు ప్రారంభించాలని కోరారు. కాకినాడ కార్పొరేషన్‌లో వున్న ఆర్కియాలజి మూజియం అత్యంత పురాతనమైనదని, తాళపత్ర గ్రంధాలు, నాణాలు, శిల్పాలు ఉన్నాయి. వీటి భద్రత కోసం, మ్యూజియం అభివృధి కోసం రూ.10 కోట్లు ప్రాజెక్ట్‌ను తయారు చేసి పంపడం జరిగిందని, ఫైనల్ కమిటీ అప్రూవల్‌తో వెంటనే ఆమోదం తెలిపి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఉప్పాడ, తొండంగి, కాకినాడ మండలాలలో అనువైన సముద్ర తీరప్రాంతంలో పర్యాటక అభివృధి కోసం బీచ్ పార్క్‌లకు తగిన నిధులు మంజూరు చేయాలని కేంద్ర టూరిజం, పురావస్తు, పర్యాటక మరియు కల్చర్‌శాఖ మంత్రి కిషన్ రెడ్డి ని కాకినాడ ఎంపి వంగా గీతా విశ్వనాథ్ కోరారు.

## పీఠం ఎక్కిన పులి - బాధ్యతలు స్వీకరించిన వడ్డి







కాకినాడ, మేజర్ న్యూస్ ప్రతినిధి : దేవాదాయశాఖ అధికారులకు పదోన్నతులు లభించాయి. దీనితో బాధ్యతలు చేపడుతున్నారు. జిల్లా ఎండోమెంట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న పులి నారాయణమూర్తికి అసిస్టెంట్ కమిషనర్ పదోన్నతి ఇచ్చి పిఠాపురం శ్రీ కుక్కుటేశ్వరస్వామి ఆలయ ఈవోగా నియమించారు.

శనివారం ఉదయం ఆయన ఆలయంలో బాధ్యతలు చేపట్టారు. ఆలయ సూపరిండెంట్ వెంకటరమణ ఆధ్వర్యంలో అర్చకులు చంద్రమౌళి, సుబ్బన్న మంగళవాయిద్యాలు నడుమ వేదమంత్రాలతో ఆశీర్వదించారు. తొలుత కుక్కుటేశ్వరస్వామి,రాజరాజేశ్వరీదేవి, పురోహితికా అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం బాధ్యతలు చేపట్టారు. అన్నదానాన్ని తనిఖీ చేశారు. మహాశివరాత్రి ఏర్పాట్లపై సమీక్ష జరిపారు. కాకినాడ డివిజన్ ఇన్స్పెక్టర్ వడ్డి ఫణీంద్ర కుమార్, ఈవోలు వడ్డాది సత్తిబాబు, డి.శ్రీనివాసరావు, శ్రీరాములు, చీమలకొండ వెంకటరమణమూర్తి, సోమరాజు, లక్ష్మణ్ కుమార్, కే.సుబ్రహ్మణ్యం తదితరులు ఆయనను కలిసి అభినందనలు తెలిపారు. పూర్తి పారదర్శకంగా దేవాదాయశాఖకు పేరు తెచ్చే విధంగా ఆలయ నిర్వహణ చేస్తానని ఈ సందర్భంగా నారాయణమూర్తి తెలిపారు. ఇక్కడపనిచేస్తున్నవడ్డి శ్రీనివాసరావు ను పెద్దాపురం మండలం తొలి తిరుపతి శృంగార వల్లభస్వామి ఆలయ ఈవోగా బదిలీ చేశారు. స్వామివారి దర్శనం తరువాత అర్చకులు వేద ఆశీర్వచనాల అనంతరం ఈఓగా బాధ్యతలు స్వీకరించారు. చైర్మన్, గ్రామ పెద్దలు ఆయనను కలిసి అభినందించారు.

## 1000 రోజులు పూర్తి చేసిన 'ఆదిత్య' నిత్యాన్నదాన పథకం





### - తలసేమిమా బాధిత చిన్నారులకు రక్తదాన శిబిరం

**కాకినాడ, మేజర్ న్యూస్ :** చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా ఆదిత్య విద్యాసంస్థల అధినేతలు నల్లమిల్లి శేషారెడ్డి, లక్ష్మీరాజ్యం దంపతుల సహకారంతో ప్రతీరోజు గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ దగ్గర చేస్తున్న నిత్యాన్నదానం 1000 రోజులు పూర్తయిన సందర్భంగా దాదాపు 1000 మందితో మెగా బ్లడ్ డొనేషన్ క్యాంప్ మరియు పాపులర్ మోటివేటర్ బ్రదర్ షఫీతో ఓ యువతా మేలుకో అంటూ యువతకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్ష కార్యదర్శులు రవికుమార్, అలీం లు మాట్లాడుతూ యువతీ యువకులు సామాజిక సేవలో ముందున్నప్పుడే సమాజంలో రక్త కొరతతో ఇబ్బంది పడేవాళ్లు, ఆకలితో అలమటించేవాళ్ళు లేకుండా చేయగలమని పిలుపిచ్చారు.

కార్యక్రమంలో ముందుగా ఆదిత్య విద్యాసంస్థల అధినేతలు ఆదర్శ దంపతులు శేషారెడ్డి, లక్ష్మీరాజ్యం లు రిబ్బన్ కత్తిరించి రక్తదాన శిబిరం ప్రారంభించారు. తలసేమియా చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ఈ మెగా బ్లడ్ డొనేషన్ క్యాంప్‌లో ఆరోగ్యంగా ఉన్న యువతీ యువకులు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేయడం జరిగింది. బ్రదర్ షఫీతో నగరంలో దాదాపు 300 మంది యువకులతో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్థానిక శాసనసభ్యులు ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి రక్తదాతలను మరియు ఇటువంటి వినూత్న కార్యక్రమాల ద్వారా సమాజానికి మేలు చేస్తున్న చేయూత టీమ్‌ను అభినందించారు. ఎవరూ ఆకలితో అలమటించకూడదనే ఆలోచన తో కరోనా కష్టకాలంలో ప్రారంభించిన ఈ నిత్యాన్నదానం అప్పుడే 1000 రోజులు పూర్తయ్యిందని తెలిసి నమ్మలేకుండా ఉన్నామని ఈ చేయూత నిత్యాన్నదానానికి తమ ఊపిరి ఉన్నంతవరకూ సహకరిస్తామని శేషారెడ్డి దంపతులు తెలియజేశారు. పాపులర్ మోటివేటర్ బ్రదర్ షఫీతో ఏర్పాటు చేయబడిన ఓ యువతా మేలుకో అనే అవగాహన కార్యక్రమంలో వేల మంది యువతీ యువకులు పాల్గొని ప్రేరణ పొందారు.

ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ వై.డి.రామారావు, రోటరీ ప్రెసిడెంట్ రవికృష్ణ, స్వామి డెవలపర్స్ అధినేత స్వామి, ఇనోదయ హాస్పిటల్స్ ఆదిత్య సోల్ మేట్స్ గ్రూప్ అధినేత అజయ్ రెడ్డి, రెడ్డి సంక్షేమ సంఘ అధ్యక్షులు బుచ్చిరెడ్డి, ధరణీ కనస్ట్రక్షన్స్ రమణారావు, చేయూత ఆర్థిక కార్యదర్శి చింతా నారాయణమూర్తి, అసోసియేట్ అధ్యక్షులు షేక్ వలీబాషా, కాకినాడ టీమ్ సురభి శారద, కే.వి.కృష్ణా రెడ్డి, వినీల్, పి.వి.సుబ్బారావు, బ్లడ్ కో-ఆర్డినేటర్ శివ, నిత్యాన్నదాన సభ్యులు అజహర్, పవన్ కళ్యాణ్, వెంకన్న, మాధవ్, మనోజ్ చుగాని, గీసాల వేంకటేశ్వరరావు, బి.శాంతి, దేగల లక్ష్మి, తేజస్విని, ఝాన్సీ, సత్యకీర్తి, అంగర లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## స్మార్ట్‌సిటికి తలమానికంగా 'శ్రీరస్తు' - ద్వారంపూడి





**కాకినాడ, మేజర్ న్యూస్ :** ప్రముఖ యూరాలజిస్ట్ డా॥ ఎస్.వి.ఎస్.రావు ఆధ్వర్యంలో నిర్మితమైన శ్రీరస్తు కన్వెన్షన్ నూతన భవన సముదాయాన్ని కాకినాడ నగర శాసనసభ్యులు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి శనివారం ఉదయం స్థానిక రామారావుపేటలో ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న నగర ప్రజల అవసరాలకు అత్యాధునిక కన్వెన్షన్ భవనాల అవసరం ఎంతో ఉందని అన్నారు. ప్రజాఅభిరుచులకు అనుగుణంగా శ్రీరస్తు కన్వెన్షన్ నిర్మాణంలో డా॥ రావు తీసుకున్న ప్రత్యేక శ్రద్ధ అభినందనీయమని కొనియాడారు. అత్యంత సురక్షితమైన వాతావరణంలో ప్రజలు వారి వేడుకల నిర్వహణకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలను చేపట్టడంతోపాటు అందరికీ ఆమోదయోగ్యంగా ఉంటుందని అభినందించారు. డా॥ ఎస్.వి.ఎస్.రావు మాట్లాడుతూ స్మార్ట్ సిటీకి శ్రీరస్తు భవనం ఐకానిక్‌గా ఉంటుందని అన్నారు. అందరూ వారివారి వేడుకలను నిర్వహించుకునేందుకు వీలుగా నిర్మాణం చేపట్టడమే కాక ఆధునిక రక్షణ వ్యవస్థను కూడా కల్పించడం జరిగిందని చెప్పారు. ప్రజలందరికీ అందుబాటులో ఉండే విధంగా శ్రీరస్తు కన్వెన్షన్ ఉంటుందని చెప్పారు. కుడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి మాట్లాడుతూ ప్రజలకు అందుబాటు ధరలలో ఏర్పాటు చేయడం అభినందనీయమని, అందరికీ చేరువలో నగర నడిబొడ్డున నిర్మించడం గొప్ప విషయమని కొనియాడారు. కార్యక్రమంలో కాకినాడ రూరల్ శాసనసభ్యులు కురసాల కన్నబాబు, పార్లమెంట్ సభ్యురాలు వంగాగీతా విశ్వనాథ్, ఎమ్మెల్సి కర్రి పద్మశ్రీ నారాయణరావుతో పాటు ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, రోటరి, లయన్స్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్, లిటరరీ అసోసియేషన్ (టౌన్ హాల్)లకు చెందిన సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. తొలుత ద్వారంపూడికి రామలక్ష్మి రావు, డా॥ వినీత్ అమృత, జోయ్స్ మినర్వాలు ఘనంగా స్వాగతం పలికి జ్ఞాపికను అందజేసారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ కింద బోటు యజమానికి ఆర్థిక సాయం

- రూ.25 లక్షలు సాయం అందజేసిన జిల్లా కలెక్టర్ డా. కృతికా శుక్లా



**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడకు చెందిన కాటాడి రామకృష్ణ పరమహంస డిసెంబర్ 1వ తేదీన వేటకు వెళ్ళి తిరిగి వస్తున్న సమయంలో భైరవపాలెం వద్ద ప్రమాదశాత్తూ బోటు దగ్ధమై మునిగిపోయిన ఘటనలో తీవ్రంగా నష్టపోయిన బోటు యజమానికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద శనివారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ డా. కృతికా శుక్లా.. శాసనమండలి సభ్యురాలు కర్రి పద్మశ్రీ, కాకినాడ సిటీ శాసనసభ్యులు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి చేతులు మీదుగా బోటు యజమానికి రూ.25 లక్షలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార సంఘాల నాయకులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## భక్తులతో పోటెత్తిన వెంకన్న ఆలయం

**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** కోనసీమ తిరుమలగా, కోరిన కోర్కెలు తీర్చే దైవంగా విరాజిల్లుతున్న వాడపల్లి వెంకటేశ్వర స్వామివారి ఆలయం భక్తులతో పోటెత్తింది. ఏడు శనివారాల వెంకన్న దర్శనం ఏడేడు జన్మల పుణ్యఫలం అనే నానుడితో రాష్ట్రాల నుండి వేలాదిమంది భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలన్నీ నిండాయి. ఆలయ ప్రాంగణమంతా భక్తుల గోవింద నామస్మరణతో ప్రతిధ్వనించింది. స్వామివారికి సుప్రభాత సేవ, నీరాజనం మంత్రపుష్పం, పుణ్యా వచనం, కళ్యాణం వంటి కార్యక్రమాలను అర్చక బృందం వైభవంగా నిర్వహించారు. బయట నుండి వచ్చే భక్తులకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపింది. వచ్చిన భక్తులకు ప్రసాద వితరణ అనంతరం అన్నదానం నిర్వహించారు. శనివారం స్వామివారి ఆదాయం రూ.33 లక్షలు సమకూరింది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చైర్మన్ రుద్రరాజు రమేష్ రాజు, డిసి భూపతిరాజు కిషోర్ కుమార్, ఎస్సై ఎస్.శ్రీనివాసు, కమిటీ సభ్యులు పెనుమచ్చ సురేష్‌రాజు, మన్యం భాను, మెర్ల వెంకటేశ్వరరావు, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## 125 వాహనదారులకు ఉచిత కంటి పరీక్షలు



**రావులపాలెం, మేజర్ న్యూస్ :** 35వ రోడ్ సేఫ్టీ మంత్‌లో భాగంగా శనివారం ఈతకోట టోల్ ప్లాజా వద్ద మేనేజర్ కె.వి.వి.ఎస్.ఎన్ రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు శిబిరంను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సల్మాన్ అన్సారీ నేషనల్ హైవే మేనేజర్ టెక్, సేఫ్టీ రిజనల్ ఆఫీసర్ కరణం హరి కృష్ణ, ప్రాజెక్ట్ మేనేజర్ బాలసుబ్రమణ్యం ముఖ్య అతిధులుగా హాజరై మాట్లాడుతూ 35వ రోడ్ సేఫ్టీ మంత్‌లో భాగంగా పరమహంస యోగానంద నేత్రాలయ వైద్యులు నేతృత్వంలో వాహనదారులకు 125 మందికి కంటి పరీక్షలు, షుగర్, బిపి తదితర పరీక్షలు నిర్వహించారు. అనంతరం అవసరమైన వాళ్ళకి కళ్ళ జోళ్ళు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్.ఓ. యూ.రవితేజ, అకౌంటెంట్ సురేష్, ప్లాజా మేనేజర్ నెహేమియా, ఐ.యమ్. మేనేజర్ సురేష్ కుమార్, ఆఫీసర్ రమేష్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్నికల నిర్వహణ కోసం నిర్దుష్టమైన చర్యలు తీసుకోవడం జరుగుతోంది

**– పెండింగ్ దరఖాస్తులు ఫిబ్రవరి 15 నాటికి పరిష్కారిస్తాం**
**– పోలింగ్ సిబ్బంది డేటా నమోదు ప్రక్రియ ఫిబ్రవరి 15 నాటికి పూర్తి చేస్తాం**
**– కనీస మౌలిక సదుపాయాలు కల్పించే చర్యలు పూర్తి చేశాం**
**– కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కె. మాధవీలత**

**రాజమహేంద్రవరం, మేజర్‌న్యూస్ :** ఎన్నికల నిర్వహణ ముందస్తు ఏర్పాట్లు, ఎన్నికల సిబ్బంది గుర్తింపు డేటా నమోదు, తుది ఓటరు జాబితా అనంతరం ఫారం 6,7,8 లయొక్క ప్రస్తుత పురోగతి తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారి, మరియు పార్లమెంట్, అసెంబ్లీ నియోజక వర్గాల రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమిక్ష నిర్వహించారు. రెండవ శనివారం ఉదయం కలెక్టరేట్ నుంచి కలక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కే. మాధవీలత, ఇతర నియోజక వర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, ఎలెక్టోరల్ అధికారులు, కలక్టరేట్ ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత జిల్లా కి చెందిన వివరాలు తెలియ చేస్తూ, ఓటరు జాబితా, ఎన్నికల నిర్వహణ సమయంలో బిఎల్‌వోలకు శిక్షణ తరగతులు నిర్వహించామన్నారు. నియోజక వర్గ స్ధాయిలో విధులు నిర్వర్తించే అధికారులకి, సిబ్బందికి శిక్షణ కొసం మాస్టర్ ట్రైనర్ ల ద్వారా ఎన్నికల నిర్వహణ, సాంకేతిక పరమైన పరిజ్ఞానం పై శిక్షణా కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందన్నారు. ఆమేరకు సంబంధిత రిటర్నింగ్ అధికారులు ఎలెక్టోరల్ సిబ్బంది తదితరులు హజారైనట్లు తెలిపారు. జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజక వర్గాల పరిధిలో సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలకు సంబందించి 395 కేంద్రాలను గుర్తించడం జరిగిందన్నారు. సర్వైవల్, ఎన్నికల ఖర్చులు, సేక్టరాల్ , తదితర ఎన్నికల విధుల్లో




భాగస్వామ్యం అయ్యే ఆయా శాఖలకు సంబంధించిన అధికారులకు పలు దఫాలుగా అవగాహన , శిక్షణా కార్యక్రమాలను పూర్తీ చేసినట్లు తెలిపారు. ఎన్నికల తేదీకి అనుగుణంగా చేపట్టవలసిన వివిధ బాధ్యతలు పై రూట్ మ్యాప్ సిద్దం చేసి ఆమేరకు ప్రణాళిక రూపొందించుకోవడం జరిగిందనీ కలెక్టర్ తెలియ చేశారు. తుది ఓటరు జాబితా ప్రకటించిన జనవరి 22 నుంచి ఫిబ్రవరి 9 వరకు ఓటరు జాబితాలో ఫారం 6 లు 1394 చేర్చినట్లు, ఫారం –7 లు 635 తొలగించినట్లు, ఫారం –8లు చెంది మార్పులు చేర్పులు 864 జరిగి నట్లు తెలియ చేశారు. పెండింగ్ లో ఫారం లకు సంబందించి ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు ఖచ్చితంగా అమలు చేయాలనీ నియోజక వర్గాల రిటర్నింగ్ అధికారులకు, ఎలెక్టోరల్ అధికారులకు ఖచ్చితమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. ఈ ఆర్వో లాగిన్‌లో ఉన్న పెండింగ్ దరఖాస్తులను పరిష్కారం చెయ్యాల్సిందిగాతెలియ చెయ్యడంతో పాటు ప్రత్యేక పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 15 నాటికి పూర్తి చేస్తామని అన్నారు. పోలింగ్ సిబ్బంది డేటా ఎంట్రీ పనులు జరుగుతున్నాయని, ఫిబ్రవరి 15 పూర్తి చేయనున్నట్లు మాధవీలత తెలిపారు. మైక్రో పరిశీలకుల ను సోమవారం నుంచి గుర్తించడం జరుగుతోందన్నారు. అందరూ రిటర్నింగ్ అధికారులు విధులను రిపోర్ట్ చెయ్యడం జరిగిందని, మిగతా అధికారులు కూడా సోమవారం నాటికి రిపోర్ట్ చెయ్యడం జరుగుతుందనీ తెలియ చేశారు. వివిధ నియోజక వర్గాల పరిధిలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్ లకు అనువైన భవనాలు గుర్తించడం జరిగిందన్నారు. ఆయా కేంద్రాలలో అవసరమైన భద్రత చర్యలు తీసుకోవడం జరుగుతోందని అన్నారు. ఎన్నికల నిర్వహణ సంబందించి కనీస మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. జిల్లాకు చెందిన గతంలో లక్షా డెబ్బై ఎనిమిది వేల ఎపిక్ కార్డులు ప్రింటింగ్ కొసం పంపడం జరిగింది, కొత్తగా 46,761 ఎపిక్ కార్డుల ప్రింటింగ్ కి డేటా పంపడం జరిగిందనీ, వీటి విషయంలో ప్రతీ రోజు ఎన్నికల కమిషన్ తో సంప్రదింపులు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 80 ప్లస్, 40 శాతం పైబడిన అబ్సెంటీ ఓటర్లు గుర్తింపు జరుగుతోందన్నారు. అదేవిధంగా రిసెప్షన్ కేంద్రాలు ఏడు నియోజక వర్గాలలో పాటు అదనపు కేంద్రం కూడా గుర్తించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో రాజమండ్రీ రూరల్ ఆర్వో జాయింట్ కలెక్టర్ ఎస్. తేజ్ భరత్, రాజమండ్రీ అర్బన్ ఆర్వో మునిసిపల్ కమిషనర్ కె. దినేష్ కుమార్, కొవ్వూరు ఆర్వో , సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్ , డి ఆర్వో జి. నరసింహులు, రాజానగరం ఆర్వో ఆర్డీఓ ఏ. చైత్ర వర్షిణి, అనపర్తి ఆర్వో ఎమ్. మాధురి, గోపాలపురం – ఓఎన్జీసి ఎస్.డి.సి కె ఎల్ శివజ్యోతి, అనపర్తి – స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (గెయిల్ (ఐ) లిమిటెడ్) ఎమ్. మాధురి, నిడదవోలు – స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, పిఐపి ఆర్ఎమ్ సి యూనిట్, కొవ్వూరు ఆర్ వి రమణా నాయక్, పర్యాటక శాఖ ఆర్ డి వి. స్వామీ నాయుడు, ఎస్.డి.సి., ఎమ్. వెంకట సుధాకర్, ట్రైనీ డిప్యూటీ కలక్టర్లు పి. సువర్ణ, ఎమ్. భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## పివికి భారత రత్న అవార్డు తెలుగు ప్రజలకు గౌరవం

**– కోనసీమ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కమన**



**అమలాపురం, మేజర్ న్యూస్ :** భారత మాజీ ప్రధాని, భారత సంస్కరణల పితామహుడు పి.వి. నరసింహారావు ని భారతరత్న అవార్డుకు ఎంపిక చేయటం తెలుగు ప్రజలకు ఇచ్చిన గౌరవంగా భావిస్తున్నామని డా. బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు శనివారం బండారులంక లోని జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయం నుండి విడుదల చేసిన పత్రికా ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా కామన ప్రభాకరరావు మాట్లాడుతూ పి.వి. నరసింహారావు ఈ దేశానికి, ఈ రాష్ట్రానికి అనేక సేవలు చేసిన గొప్ప నాయకుడని, బహుభాషా కోవిధుడు అని, గొప్ప రాజనీతిజ్ఞుడని కొనియాడారు. పి.వి.నరసింహారావుకి భారతరత్న ఇవ్వటం పట్ల తన హర్షాన్ని తెలియుచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ ఛైర్మన్ వడ్డి నాగేశ్వరరావు, నీతిపూడి బాలసత్యనారాయణ, గెడ్డం వెంకటేశ్వరరావు, అప్పన శ్రీరామకృష్ణ, వానరాసి వెంకట దుర్గారావు, వంటెద్దు బాబి, పేరి శర్మ, ముల్లేటి వెంకటేశ్వరరావు, చిట్టియాల రామజోగేశ్వరరావు తదితరులు హర్షం తెలియచేశారు.

## 9వ డివిజన్‌లో జనసేన 'మేము సిద్ధం' కార్యక్రమం



**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ సిటిలో జనసేన పార్టీ పి.ఏ.సి సభ్యులు మరియు కాకినాడ్ సిటీ ఇంచార్జ్ ముత్తా శశిధర్ నాయకత్వంలో స్థానిక 9వ డివిజన్ రాజరత్న నగర్, హంసవరం అప్పన్న వీధి సమీపంలో ములికి అప్పన్న ఆధ్వర్యంలో శనివారం సొంత ఇల్లు కావాలి హక్కు కోసం యుద్ధానికి మేము సిద్ధం అనే కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముత్తా శశిధర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సిద్ధం అని అంటూ ఎన్నికల ముందు ఒక యుద్ధ వాతావరణంతో భయభ్రాంతులని చేసి నెగ్గడానికి చేస్తున్న ప్రయత్నానికి ప్రతిగా మేము కూడా సిద్ధం అనే కార్యక్రమాన్ని కాకినాడ సిటీలో నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలో కాకినాడలోని పేదప్రజలకు సొంత ఇల్లు అనేది ఒక హక్కు కావాలనీ, ఆ హక్కు కోసం జనసేనపార్టీ పోరాటం చేస్తుందన్నారు. ప్రజల కష్టాలను తీర్చడానికి జనసేన సిద్ధం అని అంతేకానీ రాష్ట్రంలో దౌర్జన్యాలకి, అరాచకాలకీ సిద్ధం అంటే కుదరదన్నారు. ప్రభుత్వం ఏమి చేసినా ప్రజలకు ఉపయోగపడేలా చేయాలనీ కాకినాడ నగరంలో ఈవేళకి కూడా ఎంతోమందికి ఇళ్ళు లేవు ఇంకా అద్దె ఇళ్ళలో ఉంటున్నారు, ఈ ప్రాంతంలో పదిహేను సంవత్సరాల క్రితం ఇచ్చిన పట్టాలు తప్ప కొత్తగా ఇచ్చిన పట్టాలు లేవు అనీ, జనసెన పార్టీ కాకినాడలో అద్దె ఇళ్ళలో ఉంటున్న పేదప్రజలు ప్రతి ఒక్కరికీ కాకినాడలోనే ఇల్లు ఇవ్వడానికి కంకణం కట్టుకుందని హామీ ఇచ్చారు. కాకినాడలోని పేదప్రజలకు సొంతిల్లు ఒక హక్కుగా మార్చేందుకు జనసేన సిద్ధం అనీ దానికి మేము సిద్ధం అని నినాదాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిటీ ఉపాధ్యక్షులు అడబాల సత్యనారాయణ, ములికి అప్పన్న, పెద్దిరెడ్డి ఉదయభాస్కర్, మండపాక దుర్గాప్రసాద్, వెంకట అప్పారావు, బూర వెంకన్న, ఆదిబాబు, దుర్గ, బర్రే నాగేశ్వర్రావు, నక్కా నాగేశ్వర్రావు, గోవిందు, నవీన్, దుర్గారావు, కాంటా రవిశంకర్, సమీరు, మిరియాల హైమవతి, బట్టు లీల, బోడపాటి మరియా తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి కార్యక్రమాలకు అత్యంత ప్రాధాన్యత

**– మంత్రి విశ్వరూప్**



**అమలాపురం,మేజర్‌న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలకు అత్యంత ప్రాధాన్యతను ఇచ్చి గడపగడపకు మన ప్రభుత్వం నిధులు 15 ఆర్థిక సంఘం, సాధారణ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టి ప్రారంభించుకోవడం జరుగుతోందని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పినిపే విశ్వరూప్ తెలిపారు. శనివారం స్థానిక పురపాలక సంఘ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురపాలక పరిధిలో సాధారణ, 15 ఆర్థిక సంఘం గడప గడపకు మన ప్రభుత్వం నిధులైన రూ.237.16 లక్షలతో పలు వార్డు లలో ఎనిమిది అభివృద్ధి ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. వీటిలో స్థానిక 2 మరియు 4వ వార్డులలో కె.ఎన్.ఎఫ్ రోడ్డు వయా కాపు కల్యాణ మండపం నుంచి శేషాశయన గుడి వరకు రూ.25 లక్షల వ్యయంతో నిర్మించిన సి.సి. రోడ్డును, 5, 6వ వార్డులలోని సూర్యనారాయణ పేటలో రూ.45 లక్షలతో నిర్మించిన సి.సి రోడ్డు ను మంత్రి ప్రారంభించారు. పట్టణ 27 వ వార్డు ఈ.డబ్ల్యూ.ఎస్ కాలనీ నందు రూ.70 లక్షల వ్యయంతో నిర్మించి 'విశ్వరూప్ కమ్యూనిటీ హాల్' గా నామకరణం చేసిన కమ్యూనిటీ హాలు ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరించి కమ్యూనిటీ హాలును మంత్రి ప్రారంభించారు. తదుపరి పట్టణ 23వ వార్డు లాల్ బహుదూర్ శాస్త్రి స్కూల్ నుంచి వినాయక గుడి వరకు రూ.20 లక్షలతో నిర్మించిన సి.సి. రోడ్డును మంత్రి ప్రారంభించారు. స్థానిక 10 వ వార్డు తిరుగుళ్లవారి వీధి తిరుగుళ్ల చంద్ర కాంతం ఇంటి వద్ద రూ.20 లక్షలతో నిర్మించిన సి.సి.రోడ్డు ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరించి సి.సి. రోడ్లు ప్రారంభించారు. పట్టణ 28వ వార్డులో దాసరి రామారావు ఇంటి నుంచి బొంతు శ్రీనివాస రావు ఇంటి వరకు రూ.14.57 లక్షల వ్యయంతో నిర్మించిన సి.సి. రోడ్డు మరియు డ్రైయిన్‌ను, పట్టణ 29వ వార్డు లో మున్సిపల్ చిల్డ్రన్ పార్క్ వద్ద రూ.5.97 లక్షల వ్యయంతో నిర్మించిన సి.సి. రోడ్డును మంత్రి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు బొమ్మి ఇజ్రాయిల్, పురపాలక సంఘ చైర్పర్సన్ రెడ్డి సత్య నాగేంద్ర మణి, వైస్‌చైర్మన్ నానిరాజు, మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్, వివిధ వార్డుల కౌన్సిలర్లు, పట్టణ అధ్యక్షులు సంసాని నాని, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## జల్లాస్థాయి విద్య వైజ్ఞానిక ప్రదర్శన విజయవంతం చెయ్యాలి



అమలాపురం, మేజర్ న్యూస్ : ఇన్‌స్పైర్ జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను విజయవంతం చేయవలసిన బాధ్యత విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయులపై ఉందని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.కమల కుమారి సూచించారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సూర్యనగర్ నందు ఈనెల 14వ తేదీన నిర్వహించనున్న ఇన్‌స్పైర్ జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ముందస్తు ఏర్పాట్లపై జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జరిగిన సమన్వయ కమిటీ సమావేశంలో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ ముందస్తు ఏర్పాట్లు పటిష్టం గావించి ఇన్‌స్పైర్ జిల్లా స్థాయి విద్య వైజ్ఞానిక సదస్సు చక్కటి ప్రణాళిక సమన్వయంతో విజయవంతం చేయాలని సూచిం చారు. ఈనెల 14వ తేదీన స్థానిక జిల్లా ప్రజా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల సూర్యనగర్ నందు జరిగే జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు అన్ని ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందన్నారు. ఇన్‌స్పైర్ విద్య వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహణకు విధులకు కేటాయించిన సిబ్బంది వివిధ ప్రాంతాల నుండి వచ్చి ఇన్‌స్పైర్ విద్య వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొనే విద్యార్థినీవిద్యార్థులకు ఏ విధమైన అసౌకర్యం కలగకుండా చూడాలని, ప్రదర్శనకు మండలంలోని మరియు జిల్లావ్యాప్తంగా ఉన్న వివిధ పాఠశాల యొక్క విద్యార్థినీవిద్యార్థులు తప్పనిసరిగా తిలకించే విధంగా ఏర్పాట్లు చేయాలని మండల విద్యాశాఖ అధికారులు జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశించారు. ముఖ్యంగా ప్రాజెక్టులకు రాష్ట్ర స్థాయికి ఎంపికచేసే విధానం రెండు అంచెలంచెలుగా జరుగుతుందన్నారు. విద్యా వైజ్ఞానికంగా అనుభవం ఉన్న నిష్ణాతులైనటు వంటి వ్యక్తులను న్యాయనిర్ణేతలుగా ఏర్పాటు చేయడం జరిగిందని అదే విధంగా ఎన్ఐఎఫ్ నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రాజెక్టులు చేయడం జరుగుతుందని జిల్లా సైన్స్ అధికారి జివిఎస్ సుబ్రహ్మణ్యం వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజరాజేశ్వరి, జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు సెక్రటరీ బి.హనుమంతరావు, మండల విద్యాశాఖ అధికారి దుర్గాదేవి, నిమ్మకాయల గణేశ్వరరావు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## సెయింట్ పాట్రిక్స్ అకాడమీలో ఘనంగా కిండర్ గార్డెన్ క్రీడల దినోత్సవం



**రావులపాలెం, మేజర్ న్యూస్ :** రావులపాలెంలోని సెయింట్ పాట్రిక్స్ అకాడమీలో శనివారం కిండర్ గార్డెన్ విద్యార్థుల క్రీడల దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రధాన ఉద్దేశ్యం మానసిక వైజ్ఞానిక వికాసంతోపాటు శారీరక దృఢత్వాన్ని పెంపొందించడం. ప్రిన్సిపల్ బ్రదర్ సోలమన్ రాజరాజన్, స్పోర్ట్స్ సెక్రటరీ బ్రదర్ ఫెలిక్స్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు టీం గేమ్స్, పారాచూట్ రైడ్, స్టిల్ట్స్ ఉపయోగించి నిచ్చెన ఎక్కడం వంటి ఆటలతో అందరినీ అలరించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ దుర్గావతి కొత్తపల్లి జెండా ఎగరవేసి క్రీడలను ప్రారంభించారు. చదువుతోపాటు ఆటలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని, అప్పుడే ప్రతి విద్యార్థి సమర్థవంతుడిగా తయారవుతాడని ఆమె తన ప్రసంగంలో చెప్పారు. కార్యక్రమం జాతీయ గీతంతో ముగింపు కాగా, విద్యార్థులలో ఆటల పట్ల ఆసక్తి పెంచడంతోపాటు, వారి శారీరక, మానసిక ఆరోగ్యాన్ని ప్రోత్సహించడంలో ఇది విజయవంతమైంది.

# హక్కుతో కూడిన ఇళ్ల స్థలం ప్రభుత్వ లక్ష్యం









1పేజి తరువాయి

మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హత మాత్రమే ప్రాతిపదికగా తీసుకునిప్రభుత్వంఇళ్లస్థలాలనుమంజూరు చేసిందన్నారు. స్థలాలపై శాశ్వత హక్కు కల్పించాలని లక్ష్యంతో లబ్ధిదారులకు ప్రభుత్వం రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కూడా ప్రారంభించిందన్నారు. ఇచ్చే స్థలం కేవలం ఆస్తిగా కాకుండా సంపూర్ణ హక్కుతో ఇవ్వాలన్నదే ప్రభుత్వ అభిమతమన్నారు.కాకినాడ జిల్లా పరిధిలో 1,20,000 మందికి ఇళ్ల స్థల పట్టాలు ఇచ్చామని, 75 వేల గృహ నిర్మాణాలు మంజూరయ్యాయని కలెక్టర్ చెప్పారు.సుమారు 35వేల ఇళ్ళ నిర్మాణాలు కూడా పూర్తయ్యాయన్నారు.కేటాయించిన స్థలాల్లో అవసరమైనమౌలికసదుపాయాలనుకూడాప్రభుత్వమే కల్పిస్తోందన్నారు.

మాజీ మంత్రి, కాకినాడ రూరల్ శాసనసభ్యులు కురసాల కన్నబాబు మాట్లాడుతూ ప్రస్తుతం 174 ఎకరాల విస్తీర్ణంలో పంపిణీ చేస్తున్న ఇళ్ల స్థలాల ప్రాంతం రానున్న రోజుల్లో అద్భుతమైన జగనన్న మెగా టౌన్‌షిప్ గా అవతరించబోతుందని చెప్పారు. కాకినాడ రూరల్ నియోజకవర్గంలో అత్యధికంగా 31 వేల మందికి విలువైన స్థలాలను ఇళ్ల స్థలాలుగా పంపిణీ చేశామని చెప్పారు. రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ ఇంత పెద్ద ఎత్తున ఇళ్ల స్థలాలు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. ఆయా లేఔట్లను చదును చేసి విద్యుదీకరణ, మంచినీరు, రహదారులు, డ్రైనేజీలు సహా అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఇచ్చిన స్థలాలకు రిజిస్ట్రేషన్లు కూడా చేసే విధానం దేశం మొత్తం మీద ఒక్క ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి మాత్రమే అమలు చేస్తున్నారన్నారు.

ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ అనేక రంగాలలో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న పాలనా సంస్కరణలు ఇతర రాష్ట్రాలకు కూడా ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. కౌడా చైర్ పర్సన్ రాగిరెడ్డి చంద్రకళ దీప్తి మాట్లాడుతూ అద్దె ఇళ్లల్లో పేదలు పడుతున్న పాట్లను చూసి సీఎం జగన్ సొంతింటి కల నెరవేర్చాలని నిర్ణయం తీసుకున్నారన్నారు.

జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్య మాట్లాడుతూ ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్లు కూడా పూర్తిచేసి సకల మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. ప్రస్తుతం స్థలాలు పొందిన ప్రాంతాన్ని మోడల్ లేఔట్ గా అభివృద్ధి చేస్తామన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ జే.వెంకటరావు మాట్లాడుతూ నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో స్థలాలు మంజూరైన లబ్ధిదారులకు త్వరలోనే రిజిస్ట్రేషన్‌లను కూడా పూర్తి చేయడంతో పాటు, ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. అదనపు కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు మాట్లాడుతూ ఇచ్చిన ఇళ్ల స్థల పట్టాలలో వేగంగా గృహ నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని సూచించారు.

సమావేశంలో వైయస్సార్సీపి కాకినాడ నగర అధ్యక్షురాలు, మాజీ మేయర్ సుంకర శివ ప్రసన్న, కాకినాడ రూరల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ జమ్మలమడక నాగమణి, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ లింగం రవి, మాజీ కార్పొరేటర్లు వడ్డీ మణికుమార్, రాజారపు వెంకటలక్ష్మి కృష్ణ, ఐ.శ్రీను, కొలగాని దుర్గాప్రసాద్, రూరల్ డివిజన్ల జేసిఎస్ కన్వీనర్ కడియాల చిన్నబాబు, వైఎస్ఆర్సిపి రాష్ట్ర ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి రావూరి వెంకటేశ్వరరావు, తిమ్మాపురం సర్పంచ్ బెజవాడ వీర వెంకట సత్యనారాయణ, ఎస్ఈ పి. సత్యకుమారి, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వి చరణ్, టిపిఆర్ఓ మానే కృష్ణమోహన్, పలువురు నాయకులు, కార్యకర్తలు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# పోలవరం ర్వాసితులకు న్యాయం చేయాలి

**– పరిహారం పునరావాస్యం సంపూర్ణంగా కల్పించాలి– సిపిఎం**

**చింతూరు, మేజర్ న్యూస్ :** కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని అధికార వైయస్సార్సీపి, ప్రతిపక్ష టిడిపిలో అధికార దాహం తప్ప రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి త్యాగం చేస్తున్న ముంపు మండలాల ఆదివాసి గిరిజన గిరిజనేతర పేదల సమస్యలు అధికార ప్రతిపక్ష పార్టీలకు కనపడటం లేదని, పోలవరం నిర్వాసితులకు సంపూర్ణ పరిహారం, పునరావాసం కల్పించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం డిమాండ్ చేశారు.శనివారం ఎర్రంపేట రచ్చబండ వద్ద సిపిఎం చింతూరు మండల స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంపూర్ణ అభివృద్ధికి దోహదం చేస్తున్న ఇందిరా సాగర్ పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పై నిర్మిస్తున్న కాంట్రాక్టర్లపై ఉన్న శ్రద్ధ ఆదివాసీలపైన, పేదలపైన ఏ మాత్రం కనబడడం లేదని, 2006న ప్రారంభమైన ప్రాజెక్టు నిర్మాణ పనులు ఏడాదికి ఏడాది నిత్యం పెరుగుతూ బడ్జెట్ కేటాయింపులు జరుగుతున్నా నిర్వాసితులకు ఏమాత్రం పరిహారం అందడం లేదని, ప్రతి ఏడాది జూన్ జూలై మాసాలలో ఇళ్లను వరదకు వదిలి కొండ ప్రాంతాలకు తరలుతున్నారని, ప్రభుత్వం తాత్కాలిక చర్యలు తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదని అన్నారు. ఏజెన్సీ ప్రాంతాల చట్టాలకు తూట్లు పొడిచి కార్పొరేట్లకు ప్రాజెక్టుల పేరుతో భూములను కట్టబెడుతున్నారని, పేదల్లో మద్దతు తరగతి ప్రజానికంపై ధరల పేరుతో, టాక్స్‌ల పేరుతో, పన్నుల పేరుతో, విద్యుత్ చార్జీలు, పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు, అనేక భారాలను మోపుతున్నారని అయినా సరే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను విభజన చేసి ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం చేసిన బిజెపికి నేడు మన రాష్ట్రానికి చెందిన అధికార ప్రతిపక్ష పార్టీలు సంపూర్ణ మద్దతు తెలియజేస్తూ తమపై ఉన్న




కేసుల నుంచి బయటపడాలని స్వామి భక్తిని ప్రదర్శిస్తున్నారని అన్నారు. అధికారం కోసం వైసిపి అధికారంలోకి తీసుకు వస్తే ప్రత్యేక హెూదా సాధిస్తానని, నిరుద్యోగ సమస్య పరిష్కారానికి పరిశ్రమలు ఏర్పాటు చేస్తానని చెప్పినటువంటి జగన్మోహన్ రెడ్డి ఈరోజు రాష్ట్రాన్ని దివాళాకోరు రాష్ట్రంగా, నిరుద్యోగ ఆంధ్రప్రదేశ్‌గా తయారు చేసిందని, ఇకనైనా కళ్ళు తెరిచి రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపికి తగిన బుద్ధి చెప్పాల్సిన ఆలోచన చేయాలని, రానున్న ఎన్నికల్లో ప్రజలు బిజెపిని దాని మిత్ర ప్రక్షాలైన తెలుగుదేశం, జనసేన పార్టీలకు బుద్ధి చెప్తారని, రాష్ట్ర ప్రజలకు న్యాయం చేయనటువంటి బిజెపికి ఏవిధంగా మద్దతు తెలియజేస్తున్నారని ఈ సందర్భంగా ప్రశ్నించడం జరిగినది.

ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి, బుప్పెన కిరణ్, మండల కార్యదర్శి సిసం సురేష్, జిల్లా నాయకులు పల్లపు వెంకట్, మండల నాయకులు మల్లం సుబ్బమ్మ, మడకం చిన్నయ్య, గుర్రం రంగమ్మ, పోడియం లక్ష్మణ్, ఎంపీటీసీ రాజ్ కుమార్, కారం సుబ్బారావు, పిడకయ్య, కారం కొండయ్య కారం పొద్దయ్య, పాండు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# పి.గన్నవరం అసెంబ్లీ టికెట్ టీడీపీకే ఇవ్వాలి



**పి.గన్నవరం, మేజర్ న్యూస్ :** టీడీపీ, జనసేన రాజకీయ పొత్తులలో భాగంగా పి.గన్నవరం అసెంబ్లీ అభ్యర్థిత్వాన్ని టీడీపీకే ఇవ్వాలని ఆ పార్టీ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు పి.గన్నవరంలోని టీడీపీ కార్యాల యం వద్ద ఆయన నియోజకవర్గ టీడీపీ ఎస్సీ నాయకులతో సమావేశం నిర్వహించారు. టీడీపీకి కట్టుబడి ఉన్న స్థానిక నాయకులకే అసెంబ్లీ అభ్యర్థిత్వాన్ని ఇవ్వాలని తామంతా తీర్మానించుకున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని తెలుగుదేశం పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకు వెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పి.గన్నవరం గ్రామ సర్పంచ్ బొండాడ నాగమణి, టిడిపి ఎస్సీ నాయకులు నేదునూరి వీర్రాజు, పెదపూడి రాము, చుట్టగుళ్ల కిషోర్, నక్క సత్యనారాయణ, జాలెం సుబ్బారావు, చిన్నం బాల విజయరావు, పెదపూడి శ్రీను, జల్లి బాలరాజు, బడుగు జోగేష్, మంద రాజేష్, కాకర శ్రీనివాస్, గోగి రమేశ్, నాగబత్తుల సుబ్బారావు, మోతా వేంకటేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

# పిఠాపురం పట్టణంలో దోమల నియంత్రణకు చర్యలు



**– మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు గండేపల్లి రామారావు**

**పిఠాపురం, మేజర్ న్యూస్ :** పిఠాపురం పట్టణంలో దోమలు బెడద ఎక్కువగా ఉన్నందున వాటి నియంత్రణకు తగు చర్యలు చేపట్టామని పిఠాపురం మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు గండేపల్లి రామారావు (బాబీ) అన్నారు. దోమల నియంత్రణకు అవసరమైన ఫాగింగ్ మిషన్లు, స్ప్రేయర్లను శనివారం ప్రారంభించారు. పట్టణ పరిధిలో ఉన్న 30 వార్డుల్లో దోమల బెడద ఎక్కువగా ఉన్నందున వాటి పూర్తి నియంత్రణకు చర్యలు చేపడతామన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు యూనిఫామ్ పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్. కనకారావు, శానిటరీ ఇన్స్పెక్టర్ బి. తిరుమల రావు, పలువురు కౌన్సిలర్లు, మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

# 'ప్రేరణ'లో 412మంది గిరిజన యువతులకు ఉద్యోగ అవకాశాలు

**– పోలీసుశాఖ ఆధ్వర్యంలో కమ్యూనిటీ పోలీసింగ్**

**– టాటా ఎలక్ట్రానిక్స్ సంస్థలో టెక్నికల్ అసిస్టెంట్లుగా నియామకం**

**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలోని నిరుద్యోగ గిరిజన మహిళలకు కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా టాటా ఎలక్ట్రానిక్స్ సంస్థలో టెక్నికల్ అసిస్టెంట్ ఉద్యోగాల నియామక కార్యక్రమం రంపచోడవరంలో శనివారం పోలీసుశాఖ నిర్వహించింది. గిరిజన నిరుద్యోగ యువత ఉన్నత చదువులు చదువుకున్నప్పటికీ సరైన మార్గనిర్దేశం, నైపుణ్యం లేక గ్రామాల్లోనే ఉండిపోతున్నారని, వీరందరికీ స్వయం ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో కమ్యూనిటీ పోలీసింగ్ లో భాగంగా 'ప్రేరణ' అనే కార్యక్రమం ద్వారా వివిధ రకాల కోర్సులను ఉచితంగా ఏర్పాటు చేసి, స్వయం ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు. దీనిలో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ తూహిన్ సిన్హా ఉత్తర్వులు మేరకు రంపచోడవరం అడిషనల్ ఎస్పీ జగదీష్ అడహల్లి ఆధ్వర్యంలో శనివారం రంపచోడవరంలో ప్రశాంతి ఎడ్యుకేషనల్ సొసైటీ వారి సహకారంతో ప్రేరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. టాటా ఎలక్ట్రానిక్ సంస్థలో టెక్నికల్ అసిస్టెంట్ ఉద్యోగాల నియామకం కోసం ఉద్యోగాల గురించి ఇంటర్వ్యూలు నిర్వహించడం జరిగింది.

ఈ ఉద్యోగ నియామక ప్రక్రియకు రంపచోడవరం, దేవీపట్నం, అడ్డతీగల, గంగవరం, వై రామవరం, రాజవొమ్మంగి, మారేడుమిల్లి మండలాల నుండి సుమారు 450 మంది గిరిజన యువతులు హాజరుకాగా, వారిలో 412 మంది అభ్యర్థులు టాటా ఎలక్ట్రానిక్ సంస్థలో టెక్నికల్ అసిస్టెంట్ ఉద్యోగాలకు ఎంపికయ్యారని







పోలీసు అధికారులు తెలియజేశారు. ఇంటర్వ్యూలో ఎంపికైన వీరందరూ తమిళనాడు రాష్ట్రంలోను, హొసూర్ టౌన్‌లో గల టాటా ఐఫోన్ తయారీ కంపెనీకు ఉద్యోగాల కోసం పంపించడం జరుగుతుందని తెలిపారు. అన్ని అలవెన్సులు కలుపుకొని నెలకు సుమారు రూ.18 వేలు జీతం అందుకుంటారని, అలాగే వీరందరికీ టాటా కంపెనీలలో పనిచేస్తున్న వ్యక్తులు, ఉద్యోగులు మాదిరిగా పిఎఫ్, మెడికల్ ఫెసిలిటీ ఇతర బెనిఫిట్స్ కల్పించడం జరుగుతుందని టాటా ఎలక్ట్రానిక్స్ సంస్థ ప్రతినిధులు తెలియజేశారు.ఈ సందర్భంగా రంపచోడవరం ఏ ఎస్ పి జగదీష్ అడహల్లి మాట్లాడుతూ గిరిజన యువతులకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పనిచేసే ఐఫోన్ తయారీ ప్లాంట్‌లో ఉద్యోగాలు రావడం గొప్ప అవకాశం అని అన్నారు. ఎంపికైన మహిళలు ఆదర్శంగా నిలవాలని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో బాలికల విద్య జీవితాన్ని ఎలా మారుస్తుంది అనే దానికి ఎంపికైన గిరిజన బాలికలే ఉదాహరణగా ఉంటారన్నారు. తల్లిదండ్రులందరూ వారి పిల్లలను విద్యలో ప్రోత్సహించడానికి దీన్ని ఒక అవకాశంగా ఉపయోగించుకోవాలన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలను గిరిజన యువత అందరూ సద్వినియోగం చేసుకొని, ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కాగా ఈనెల 12వ తేదీన ఎటపాక లో టాటా ఎలక్ట్రానిక్స్ సంస్థ నిర్వహించనున్న ఉద్యోగ నియామక ప్రక్రియకు జిల్లా పరిధిలోని నిరుద్యోగ గిరిజన మహిళలు హాజరై ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, తద్వారా మహిళ స్వయం సమృద్ధికి నాంది పలకాలని అడిషనల్ ఎస్పీ జగదీష్ అడహల్లి విజ్ఞప్తి చేశారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా వ్యాధిగ్రస్తులను ఆదుకుంటాం

**– మంత్రి విశ్వరూప్**



**అమలాపురం,మేజర్‌న్యూస్ :** ప్రాణాంతక వ్యాధులు, దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతున్న పేదలను ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటోందని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పినిపే విశ్వరూప్ పేర్కొన్నారు. శనివారం మంత్రి క్యాంపు కార్యాలయం నందు కామనగరువు ఎం.ఎస్.ఎన్. కాలనీకి చెందిన కంచర్ల భైరవమూర్తి ఊపిరితిత్తుల మార్పిడి చేయుటకు రూ.20 లక్షలు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరు చేసిన లెటర్ ఆఫ్ సర్టిఫికెట్‌ను మంత్రి బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సహాయ నిధి కింద పేద ప్రజల వైద్య చికిత్స కోసం ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అందిస్తోందన్నారు. సమాజంలో అట్టడుగువర్గాలు, తెల్లకార్డు దారులు, దారిద్ర్య రేఖకు దిగువున ఉన్నవారు ఈ పథకం ద్వారా లబ్ధిపొందేందుకు అర్హులన్నారు. ఈ పథకం కింద పేదలు ప్రాణాంతక దీర్ఘకాలిక వ్యాధులకు చికిత్సలు ఉచితంగా పొందవచ్చునన్నారు. వ్యాధిగ్రస్తులు తమ దరఖాస్తులను మండల తహసీల్దారు ద్వారా జిల్లా కలెక్టర్‌కి పంపితే, అర్హత ఉన్నట్లయితే సీఎంఆర్ఎఫ్ కింద ఆర్థిక సహాయం కోసం ప్రభుత్వానికి కలెక్టర్ సిఫారసు చేస్తారన్నారు. ప్రజాప్రతినిధుల ద్వారా అయినా ప్రభుత్వానికి లేదా ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపవచ్చునన్నారు. ఆరోగ్యశ్రీ పథకం వర్తించని కేసులకు సంబంధించి రోగులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. దీర్ఘకాలిక మరియు ప్రాణాంతక వ్యాధులకు సీఎం రిలీఫ్ ఫండ్ బాసటగా నిలుస్తూ పేద ప్రజలకు కొండంత అండగా ఉందన్నారు. ఈ కార్యక్ర మంలో స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## త్రాగునీరు ఎద్దడి రాకుండా చర్యలు

**– రేఖపల్లి సర్పంచ్ పూనెం సరోజిని**



**వి.ఆర్.పురం, మేజర్ న్యూస్ :** త్రాగునీరు ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు ప్రజలకు, అందుబాటులో ఉంటూ చర్యలు తీసుకుంటున్నట్లు రేఖపల్లి సర్పంచ్ పూనెం సరోజిని స్పష్టంచేశారు. వరరామచంద్రాపురం, మండలంలోని రేఖపల్లి, గ్రామపంచాయతీలో గల అన్నవరం, గ్రామంలోని చెరువు గుంపువద్ద శనివారం, స్థానిక సర్పంచ్ సరోజిని, మోటార్ రిపేర్ చేయించి మంచినీరు అందించడం జరిగిందని ఆమె అన్నారు. గుంపులో కొన్ని రోజులుగా మోటార్స్ చెడిపోయి నీళ్లకి చాలా ఇబ్బంది పడుతున్న ప్రజలు బాధలనుచూసి, యుద్ధ ప్రాతిపదికన రిపేర్ చేయించామని వివరించారు. వేసవికాలాన్నీ దృష్టిలోఉంచుకొని, మంచినీళ్లు అందించడం జరిగిందన్నారు. ప్రజలు ఎలాంటి సమస్యలు పడకూడదని ఏ సమస్య ఉన్నా మాకు తెలియజేయాలని ఆమె కోరారు. ప్రజలకు ఏఇబ్బంది వచ్చినా..! ముందుండి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. చెరువు గుంపు గ్రామస్తులు రేఖపల్లి సర్పంచ్ సరోజినీకి ప్రజలు ధన్యవాదాలు తెలియజేశారు.క ార్యక్రమంలో సి.పి.ఎం.పార్టీ జిల్లా నాయకులు పూనెం సత్యనారాయణ, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## జనసేన నాయకులు దళితులకు క్షమాపణ చెప్పాలి

**– దళితులపై తప్పుడు కేసులు బనాయిస్తే చూస్తూ ఊరుకోం**





**– పి.వి.రావు మాలమహానాడు డిమాండ్**

**పిఠాపురం, మేజర్ న్యూస్ :** పిఠాపురం పట్టణంలో జనసేన రాజకీయ పార్టీకి చెందిన నాయకుడు మాదేపల్లి శ్రీనివాసరావుపై హత్యాయత్నం చేయుటకు రెక్కీ నిర్వహించారంటూ... నలుగురు దళిత యువకులపై పిఠాపురం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు వారి ఫోటోలు సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేయడంతో దళిత యువకులు ఎమ్. అభిరామ్, పి. సతీష్, ఎన్. సూర్య కిరణ్, ఎస్. నానిబాబులను విచారణ పేరుతో స్టేషన్ కు పిలిపించి సాయంత్రం వరకు స్టేషన్లో కూర్చొబెట్టడం చాలా అవమానకరమని పి.వి.రావు మాలమహానాడు జాతీయ అధ్యక్షులు పండు అశోక్ కుమార్ పేర్కొన్నారు. జరిగిన సంఘటనపై బాధిత కుటుంబాలతో శనివారం పత్రికా సమావేశం నిర్వహించారు. పోలీసుల విచారణలో నలుగురు యువకులు ఎటువంటి హత్యాయత్న ప్రయత్నంచేయలేదని రుజువైనందున, ఇటువంటి తప్పుడు ఫిర్యాదు చేసిన జనసేన నాయకులపై తగు చర్యలు తీసుకుని, భవిష్యత్ లో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకొనవలసినదిగా పోలీసులను కోరారు. జనసేన నాయకులు వారి రాజకీయకోసం దళితులపై తప్పుడు పిర్యాదులు చేస్తే... చూస్తూ ఊరుకోమని, ఇప్పటికీ మా దళిత యువకులపై తప్పుడు ప్రచారం చేస్తున్న మాదేపల్లి శ్రీనివాసరావుపై జనసేన పార్టీ తగు చర్యలు తీసుకోవాలని, లేకుంటే భవిష్యత్ లో జరిగే పరిణామాలకు వారే పూర్తి బాధ్యత వహించవలసి ఉంటుందని హెచ్చరించారు.

ఈ విషయంలో ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా దర్యాప్తు చేసి దళిత యువకులపాత్ర లేదని తేల్చిన పిఠాపురం పట్టణ పోలీసులకు అభినందనలు తెలియజేస్తూ, అండగా నిలిచిన ప్రింట్ & ఎలక్ట్రానిక్ మీడియా సోదరులకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని, ఇటువంటి సున్నితమైన విషయాలలో తొందరపాటుతో కాకుండా ఆలోచించి ముందుకెళ్లాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పి.వి.రావు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మారెళ్ల సోమరాజు, పిఠాపురం నియోజకవర్గ ఉపాధ్యక్షులు రోకళ్ళ సూరిబాబు, ప్రధాన కార్యదర్శి ఇజ్జన చలపతిరావు, కార్యవర్గ సభ్యులు మహేంద్రాడ సింహాచలం, పిఠాపురం పట్టణ అధ్యక్షులు వేళంగి వెంకటేష్, ఉపాధ్యక్షులు మైనాబత్తుల చిన్న, కార్యదర్శి శీకోలు రాజశేఖర్, బాధిత కుటుంబాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పోలీసువారి అధ్వర్యంలో అల్లిగూడెం నుండి చింతూరుకు ఉచిత బస్సు సర్వీసు



**చింతూరు, మేజర్ న్యూస్ :** అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం పేగ పంచాయతీ అల్లిగూడెం గ్రామంలో అల్లూరి జిల్లా పోలీస్ అధ్వర్యంలో మొట్టమొదటిసారిగా అల్లిగూడెం ఎవోపిలో అల్లిగూడెం గ్రామం నుండి చింతూరుకు ఉచిత బస్సు సర్వీస్‌ను చింతూరు పోలీస్ తరుపున అల్లిగూడెం ప్రజలకు ఆత్మీయ బహుమానంగా అల్లిగూడెం ఏవోపి ప్రాంతాలైన అల్లిగూడెం, మల్లంపేట, నర్సింగ్ పేట పరిసర గిరిజన ప్రజల ప్రయాణ సౌకర్యార్థం శనివారం అల్లూరి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాలతో రంపచోడవరం ఓఎస్‌డి కె.వి.మహేశ్వర్‌రెడ్డి, చింతూరు ఏఎస్‌పి రాహుల్ మీనా ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఎపిఎస్‌అర్‌టిసి బస్సు సర్వీసును ప్రారంభించినారు. ఈ సర్వీసు రోజుకు రెండు సార్లు నడపబడుతుందని తెలిపారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో రంపచోడవరం ఓఎస్‌డి కె.వి.మహేశ్వర్ రెడ్డి, చింతూరు ఏఎస్‌పి రాహుల్ మీనా మాట్లాడుతూ మావోల ఇలాకైన అల్లిగూడెం ప్రాంతంలో ప్రజలు బస్సు సర్వీసులు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని వారి కష్టాలను దగ్గర నుండి చూసిన మేము ఈ బస్సు సర్వీసును నడిపి ప్రమాదకరమైన ప్రయాణాలను నివారించాలి అనే ముఖ్య ఉద్దేశముతో ప్రారంభించామని అన్నారు. అక్కడ గ్రామ గిరిజన ప్రజలు పోలీసు వారి సేవలను కొనియాడారు. సుమారు 15 సంవత్సరాల క్రితం ఇక్కడ ప్రాంతం ఖమ్మం జిల్లాలో ఉన్నపుడు మల్లంపేట సర్వీసు నడపబడేదని అప్పుడు పరిస్థితుల రీత్యా ఇప్పటివరకు మాకు బస్సు సర్వీసు లేక అనేక ఇబ్బందులు పడుతున్నామని మా పరిస్థితిని చూసి పోలీసువారు మా గిరిజన గ్రామాల్లో చేస్తున కార్యక్రమాలు చాలా అభినందనీయం అని పరిసర గిరిజన గ్రామ పెద్దలు తెలిపారు.ఈ కార్యక్రమంలో చింతూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ గజేంద్ర కుమార్, సబ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ మరియు పోలీసు సిబ్బంది, చుట్టుప్రక్కల గిరిజన ప్రాంతాల గ్రామపెద్దలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# సిపిఐఎంకు విరాళాలిచ్చి తోడ్పడండి



**అమలాపురం, మేజర్ న్యూస్ :** సామాన్య ప్రజల కోసం, పేదల కోసం అనునిత్యం ఉద్యమించే సిపిఐ (యం)కి అండగా, వెన్నుదన్నుగా నిలిచి భుజం తట్టి ప్రోత్సహించవలసినది ప్రజలేనని, ప్రజలపై విశ్వాసంతోనే సిపిఐ (యం) నిలబడి పోరాడుతుందని సిపిఎం పార్టీ నాయకులు ఆంధ్ర మాల్యాద్రి అన్నారు. 2024 ఫిబ్రవరి 7 నుండి కోనసీమ జిల్లా వ్యాపితంగా ప్రజల వద్దకు వెళ్ళి పార్టీ ప్రజా ఉద్యమాల నిర్వహణ నిధి వసూళ్ళు చేయాలని పార్టీ జిల్లా కమిటీ నిర్ణయించిందని ఆర్థికంగా మీ శక్తిమేరకు తోడ్పడాలని మల్యాద్రి పిలుపునిచ్చారు. శనివారం అమలాపురంలో ప్రజానిధి కార్యక్రమంలో సిపిఎం పార్టీ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కన్వీనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సిపిఎం పార్టీ ప్రజల పార్టీ అని ఈ పార్టీని నడిపించాల్సినది ఆదరిం చాల్సినది సామాన్య ప్రజలే అని అందుకే సిపిఐ(యం) విరాళాల కోసం మీ ముందుకు వస్తోందని అన్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శులు దుర్గాప్రసాద్ కృష్ణవేణిలు మాట్లాడుతూ నిత్యం సామాన్య ప్రజల బాగు కోసం, రాష్ట్రాభివృద్ధి కోసం నిజాయితీగా, నిస్వార్థంగా పాటుపడుతున్న పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) విరాళాలు అందించి సహకరించాలని ప్రజలను కోరారు. ఆదర్శ నేత పుచ్చలపల్లి సుందరయ్య ఆనాడు వేసిన బాటలో ముందుకు సాగుతూ సమాజంలో పేదరికం పోయి, కష్టజీవి సుఖ శాంతులతో జీవించాలని, రాష్ట్రం అభివృద్ధి మార్గంలో ముందుకు సాగాలని సిపిఐ (యం) అనునిత్యం కృషి చేస్తోందని తెలిపారు. ఐద్వా నాయకురాలు నాగ వరలక్ష్మి మాట్లాడుతూ నిత్యం పెరుగుతున్న ధరలతో, తరుగుతున్న ఆదాయాలతో, నిరుద్యోగంతో సామాన్యులుసతమతమౌతున్నారనీ కరెంట్ షాక్‌తో వ్యాపారాలు, పరిశ్రమలు కూడా మూతపడుతున్నాయని రాష్ట్రం కరువుకోరల్లో చిక్కుకుపోయివుందని, వైద్యం, విద్య ఖరీదైన సరుకులయ్యాయని, విద్యుత్తు చార్జీలు తడిసి మోపెడయాయని దళితులు, గిరిజనులు, మహిళలు, మైనారిటీలు, ఇతర బలహీనవర్గాలు నిర్లక్ష్యానికి, అవమానాలకు, అత్యాచారాలకు, దాడులకు గురవుతూనే వున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాసంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పి.వి. నరసింహారావుకు భారతరత్న ప్రకటించడం పట్ల హర్షం



కాకినాడ, మేజర్ న్యూస్ : కాకినాడ సిటిలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో పి.ఏ.సి సభ్యులు మరియు కాకినాడ సిటి ఇంచార్జ్ ముత్తా శశిధర్ నాయకత్వంలో శనివారం భారతరత్నగా ప్రకటింపబడ్డ దివంగత ప్రధాని పి.వి నరసింహారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా దంటు భాస్కర్, సీనియర్ న్యాయవాదులు వెంకటేష్, మెర్ల నరసింహారావు పాల్గొన్నారు.

మాజీ భారత ప్రధాని పాములపర్తి వేంకట నరసింహారావుకి దేశత్యున్నత పురస్కారం అయిన భారతరత్న అవార్డుని ప్రకటించిన సందర్భంగా తన హర్షాన్ని ముత్తా శశిధర్ వ్యక్తపరిచారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని పి.వి నరసింహారావుకి కాకినాడతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఆనాడు కేంద్ర విదేశాంగశాఖ మంత్రి హోదాలో శాసనసభ్యులుగాను మరియు మునిసిపల్ ఛైర్మంగా సేవలు అందించిన దంటు భాస్కర రావుగారి విగ్రహావిష్కరణకి కాకినాడ రావడం జరిగిందనీ, వారికుటుంబ సభ్యుడు మనువడు అయిన భాస్కర్, ప్రముఖ న్యాయవాదులు మెర్ల నరసింహారావు, అయ్యాగారి వెంకటేష్ లతో ఆయన ఆవిష్కరించిన శిలాఫలకంవద్ద వారి చిత్రపటానికి నివాళులు అర్పించి భారతరత్న పి.వి నరసింహారావు సేవలను శ్లాఘించారు. మొట్టమొదటి భారతరత్న పొందిన తెలుగువ్యక్తిగా తెలుగువారికి గర్వకారణమైన వారి జ్ఞాపకార్థం కాకినాడ నగరంలో కూడా నిర్మాణం చేయాలని అకాంక్షించారు. దంటు భాస్కర్ తన తాతతో పి.వి నరసింహారావు స్నేహాన్ని గుర్తుచేసుకుంటూ ఈ విగ్రహ ఆవిష్కరణకి వచ్చినప్పుడు తమ కుటుంబ ఆతిధ్యాన్ని స్వీకరించి తన స్నేహాన్ని గౌరవించిన గొప్ప మనిషి అని, అలాంటి వీరికి భారతరత్న రావడం సంతోషంగా ఉన్నారు. మెర్లనరసింహారావు మాట్లాడుతూ తమ తాతగారితో పి.వి నరసింహారావు అనుబంధాల గుర్తులను పంచుకున్నారు. అయ్యగారి వెంకటేష్ మాట్లాడుతూ దేశం అతలాకుతలం అయిపోతున్న వేళ ప్రధానమంత్రిగా బాధ్యత చేపట్టి ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టి విపక్షాలతోనే కాక ప్రపంచదేశాల మెప్పును పొందిన మహనీయుడనీ, నేడు ప్రపంచ దేశాలతో పోటీపడుతున్న స్థాయి ఆయన విశేష కృషి అని భారతరత్న ప్రకటించి గౌరవించడం సముచితగౌరవం అని హర్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తలాటం సత్య, సిటీ ఉపాధ్యక్షులు అడబాల సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, పెద్దిరెడ్డి ఉదయభాస్కర్, ఆకుల శ్రీను, మనోహర్ లాల్ గుప్తా, వాడ్రేవు లోవరాజు, కంట రవిశంకర్, తోరం చిరంజీవి, మురళీకృష్ణ, నగేష్, వాసిరెడ్డి సతీష్, గోవిందరావు, దుర్గాప్రసాద్, సాధన గంగాధర్, చీకట్ల శ్రీనివాసు, వీర మహిళలు రచ్చ ధనలక్ష్మి, మిరియాల హేమావతి, చోడిపల్లి సత్యవతి, బేబీ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమము, అభివృద్ధే విజయానికి బాటలు -ఎమ్మెల్యే



**అనపర్తి, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న సంక్షేమము, అభివృద్ధే రానున్న ఎన్నికల్లో విజయకేతనానికి బాటలు అని అనపర్తి ఎమ్మెల్యే డా. సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. శనివారం ఎమ్మెల్యే పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. స్థానిక జిబిఆర్ కళాశాల ఏరియాలో రూ.3.89 కోట్ల వ్యయంతో నిర్మించిన వివిధ అభివృద్ధి పనులను, ఇందిరానగర్ ఏరియాలో 64.50 లక్షలు, ఎన్టీఆర్ కాలనీ ఏరియాలో రూ.25.20 లక్షలు, సబ్ రిజిస్టర్ ఏరియాలో 19.50, సునంద పేట ఏరియాలో 33.45, మార్కండేయపురం ఏరియాలో 24.50 లక్షల వ్యయంతో నిర్మించిన రోడ్ ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం రూ. 2.21 కోట్ల వ్యయంతో నిర్మించిన పైపు లైన్లు, తాగునీటి కుళాయిలు ఎమ్మెల్యే ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్, పార్టీ మండల కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి(రాంబాబు), పార్టీ అనపర్తి పట్టణ అధ్యక్షులు, రంగంపేట మండల ఇంచార్జ నల్లమిల్లి మురళీమోహన్ బాలకృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ కర్రి దాస్, ఉప సర్పంచ్ చిర్ల వీర్రాఘవరెడ్డి, సత్తి వెంకటరెడ్డి (పొలమూరు),ఇంకా పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా పురందరదాసుల ఆరాధన



**కాకినాడ, మేజర్ న్యూస్ :** పురందరదాసుల ఆరాధన సందర్భంగా మధ్వసంఘ ఆధ్వర్యంలో స్థానిక రాఘవేంద్ర స్వామిమఠంలో ఆరాధన ఘనంగా నిర్వహించారు. తొలుత హరిదాసుల వేషములతో చిన్నారుల ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. అంతకు ముందు శ్రీరాఘవేంద్ర స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురందరదాసుల చిత్రపటానికి భక్తి శ్రద్ధలతో మహిళలు భక్తులతో కలసి పుష్పార్చన నిర్వహించారు. రాఘవేంద్రస్వామి మఠం మేనేజర్ పవనాచార్, మధ్వసంఘ అధ్యక్షులు కోటి వెంకట నరసింహారావు, కార్యదర్శి చిలుకూరి ముఖ్య ప్రాణారావు, ఆరిని లక్ష్మణరావు, మారేమండ సీతారామయ్య సంయుక్త ఆధ్వర్యంలో పురవీధులందు అద్భుతమైన ఊరేగింపు నిర్వహించారు. పల్లకీలో శ్రీపురందర దాసులవారి చిత్రపటాన్ని ఉంచి దాసులవారి కీర్తనలను ఆలపిస్తూ ఊరేగింపు చేశారు. అధ్యక్షులు కోటి నరసింహారావు మాట్లాడుతూ మధ్వమతానికి విశేషమైన కృషిని కీర్తనల ద్వారా అందించిన దాసశ్రేష్టులని కీర్తించారు. కార్యదర్శి ముఖ్య ప్రాణరావు మాట్లాడుతూ నాలుగు లక్షల డెబ్బై ఐదు వేల కీర్తనలను రచించిన గొప్ప వ్యక్తి అని స్మరించుకున్నారు. ప్రతి సందర్భంలోనూ ఆ విషయాలను ప్రస్తావిస్తూ చేసిన కీర్తనలు జన బహుళ్యయంలో విశేష ప్రాచుర్యం పొందాయన్నారు. మధ్వ పురోహితులు యాతగిరి భీమాచార్ మాట్లాడుతూ భగవంతుని మహిమలను మరియు ఇతిహాస పురాణాల యొక్క సారాంశాన్ని సులభమైన కీర్తనల ద్వారా ప్రపంచానికి అందించిన గొప్ప వ్యక్తి అని ప్రస్తావించారు. దాస సాహిత్య అధ్యాపకులు ఆకొండి వెంకటరావు మాట్లాడుతూ దాస సాహిత్యంలో అనేక విషయాలను మనం పరిశీలించవచ్చని చెప్పారు.ఆయన కీర్తనలతో తరించిన అనేక మంది భక్తుల విషయాలను ప్రస్తావించారు. మధ్వ సంఘ మహిళా సభ్యులు ముక్తకంఠంతో దాసుల కీర్తనలను ఆలపించారు. మధ్వ సంఘ సభ్యులు మరియు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సూర్య
తూర్పుగోదావరి
ఆదివారం
11 ఫిబ్రవరి 2024


## గోపాలపురం నియోజక వర్గం ఆర్వోగా శివజ్యోతి



రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ : గోపాలపురం - ఓఎన్జిసి ఎస్.డి.సిగా బాధ్యతలు చేపట్టిన కెవిఎల్.శివజ్యోతి శనివారం ఉదయం కలెక్టర్ ఛాంబర్లో జిల్లా కలెక్టర్ డా కే.మాధవీలతను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత ఎన్నికల నిర్వహణ కోసం నిర్దుష్టమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకుని, ఆమేరకు చర్యలు తీసుకోవాలని తెలియ చేశారు. ఇప్పటి వరకు గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్ అదనపు మునిసిపల్ కమిషనర్గా పనిచేస్తున్న శివ జ్యోతి బదిలీపై జిల్లాకు రావడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ ను కలిసిన వారిలో ఎస్.డి.సి., ఎమ్. వెంకట సుధాకర్ ఉన్నారు.

## ఘనంగా దాట్ల బుచ్చిబాబు జన్మదిన వేడుకలు

**- లోకేష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భారీ అన్నదానం**



**మురమళ్ళ, మేజర్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు దాట్ల బుచ్చిబాబు జన్మదిన వేడుకలు నారా లోకేష్ యువజన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఫౌండేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చెరుకూరి సాయిరాం వర్మ, రాష్ట్ర అధ్యక్షులు మండపాక సుబ్బు, చెరుకూరి సాయిరాం వర్మ ఆధ్వర్యంలో దాట్ల బుచ్చిబాబు జన్మదిన వేడుకలలో భాగంగా యానం ఎదురులంక, మురమళ్ళ కూడలిలో కార్లు బైక్ ర్యాలీ నిర్వహించారు. దాట్ల బుచ్చి బాబుని భారీ గజమాలతో సత్కరించారు. ఖడ్గం బహూకరించారు. అన్న ఎన్టీఆర్ జనార్దన్ కేరేజ్ ద్వారా 640 రోజు పేదలకు భోజన వసతి కల్పించారు. ముమ్మిడివరం ఫౌండేషన్ అధ్యక్షులు అంగాని శేషగిరి వర్మ ఆధ్వర్యంలో మూడు పేద కుటుంబాలకు 25 కేజీల బియ్యం బస్తాలని పంపిణీ చేశారు. ఫౌండేషన్ ద్వారా గత 640రోజులుగా పేదలకు భోజన వితరణ చేస్తున్న మండపాక సుబ్బు, వర్మలను పలువురు కొనియాడి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కడప జగదీష్, కర్రీ వీరబాబు, మండపాక నాగబాబు, సాయి వర్మ యూత్ ఫోర్స్, ఫౌండేషన్ సభ్యులు శ్రీరాములు, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

# దామాషా ప్రకారం సీట్లు కేటాయించని పార్టీలకు బుద్ధి చెబుతాం

**- బీసీ కులాల ఐక్య పోరాట వేదిక**





**కాకినాడ రూరల్, మేజర్ న్యూస్ :** జనాభా దామాషా ప్రకారం తమకు తగ్గ సీట్లు కేటాయించని రాజకీయ పార్టీలకు తగిన గుణపాఠం చెబుతామని బీసీ కులాల ఐక్య పోరాట వేదిక నాయకులు హెచ్చరించారు. స్థానిక రూరల్ మండలం రమణయ్యపేట శ్రీ కన్వెన్షన్ హాల్ నందు బీసీ కులాల ఐక్యవేదిక పోరాట వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు చొల్లంగి వేణుగోపాల్ అధ్యక్షతన, శెట్టిబలిజ కన్వీనర్ పంపన బుజ్జి ఆధ్వర్యంలో బిసి కులాల ఐక్య పోరాట వేదిక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బీసీ సామాజికవర్గానికి చెందిన వివిధ కులాల ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొని ప్రసంగించారు.

ఈ సందర్భంగా ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు చొల్లంగి వేణుగోపాల్ మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు బిసి కులాలను చిన్న చూపు చూస్తున్నాయని, ఒక్క కాకినాడ పార్లమెంట్ పరిధిలో పదిలక్షల ఓట్లు కలిగిన బిసి కులాలకు తగినంత ప్రాధాన్యత కల్పించడం లేదని, బీసీ కులాలకు ఉన్న సంఖ్య ప్రకారం సీట్లు కేటాయించని రాజకీయ పార్టీలకు తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన అన్ని కులాలు ఒకే వేదికపై రావాలని కలిసికట్టుగా ఉంటే బలం పెరుగుతుందని వచ్చిన నాయకులకు పిలుపునిచ్చారు. ఈసారి ఎన్నికల్లో మాత్రం తమను గుర్తించి తగినంత ప్రాధాన్యం ఇచ్చిన పార్టీలకే తమ మద్దతు తెలుపుతామని ప్రాధాన్యత తగ్గించిన ఏ రాజకీయ పార్టీకి అయినా సరే తాము ఓట్లు వేసేది లేదని వేయవద్దని సమావేశానికి వచ్చిన నాయకులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఓట్ల కోసమే తమను ఉపయోగించుకుంటు న్నారని, సీట్లు కేటాయింపులో మొండి చేయి చూపిస్తున్నారని, రాజకీయ ప్రాధాన్యత తగ్గించిన పార్టీలకు ఖచ్చితంగా బుద్ధి చెపుతామని హెచ్చరించారు. పార్లమెంట్ పరిధిలో నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహిస్తామని బీసీలకు మొండి చేయి చూపిన పార్టీలకు ఓట్లు వేయవద్దని చెప్పి పిలుపునిస్తామని ఈ సందర్భంగా అన్నారు. ఈ సమావేశంలో సుందరపల్లి గోపాలకృష్ణ, పెద్దింశెట్టి వెంకటేశ్వరరావు, ఆవుపాటి ఉమాశంకర్, మల్లాడి రాజు, కోమిరిసెట్టి నరసింగరావు, కోలా ప్రసాద్వర్మ, గుత్తుల రమణ, డాక్టర్ అనుసూరి పద్మలత, కుండల సాయికుమార్, కాకరాపల్లి చలపతి, నులుకుర్తి వెంకటేశ్వరరావు, గుబ్బల తులసీ కుమార్, బొజ్జా భవానీ సాంబశివరావు, తాతపూడి రామకృష్ణ, కర్రి గోపాలకృష్ణ, రాయుడు నాగేశ్వరరావు, పితాని నూకరాజు, కుడుపూడి వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## వైద్యసేవల్లో ఇబ్బందులు లేకుండా చూడండి

**- ఎమ్మెల్యే చిన రాజప్ప**



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** ప్రజలకు వైద్య సేవలు అందించే విషయంలో సిబ్బంది నిబద్ధతతో పనిచేసి లోపాలు తలెత్తకుండా చూడాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన్నారాజప్ప అన్నారు. శనివారం సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రిలో ఆసుపత్రి కమిటీ సమన్వయ సమావేశం జరిగింది. ఆసుపత్రి సూపరిం డెంటెంట్ డా. అమల అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని ఆసుపత్రి ద్వారా అందుతున్న సేవలను సమీక్షించారు. ఆసుపత్రిలో సదుపాయాలు, వైద్యుల వివరాలు అడిగి తెలుసు కున్నారు. ఆసుపత్రికి జెనరేటర్ సదుపాయం ఉన్నా దానికి ఇంస్టాలేషన్ పనులు పూర్తి కాక ఉపయోగంలోకి రాలేదని డా. అమల ఎమ్మెల్యే కు వివరించారు. ఆసుపత్రి స్థాయికి సంభందించి అవసరమైన వైద్య సిబ్బంది అంతా నియామకం జరిగినట్టు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఆసుపత్రిని ఆనుకుని జరుగుతున్న ఆక్రమణ లపై ఎమ్మెల్యే ఆరా తీశారు. కాగా ఈ సందర్భంగా ఆసుపత్రిలో రోగుల కోసం ఉన్న సదుపాయాలను ఆయన పరిశీలించి వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తేదేపా నాయకులు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, కంటే జగదీస్, బలుసు వాసు, యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, పడాల వీరబాబు, మెండం సరయ్య, ఎండి సైపుల్ల, ఎండి అభిబుల్ల,పడాల వీరబాబు,గోల్తి సత్య నారాయణ, వల్లూరి దొర, వల్లూరి గాంధీ, గుడాల శంకర్, ఆసుపత్రి వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హెచ్ఐవి బాధిత పిల్లల పౌష్టికాహార కిట్లకై లైన్స్ క్లబ్ (ఎలైట్) ఆర్ధిక సహాయం



**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ శాంతినగర్లో ఉన్న శ్రీ రామకృష్ణ సేవాసమితికి కాకినాడ లైన్స్ క్లబ్ (ఎలైట్) వారు విచ్చేసి ఆర్ధిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా లైన్స్ క్లబ్ గవర్నర్ వేలూరి సూర్యనారాయణ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. సేవాసమితివారు నిర్వహిస్తున్న హెచ్ఐవి సోకిన పిల్లల పౌష్టికాహార కిట్లకు ఈ నెల వితరణ చేయడానికి రూ.36 వేల చెక్కును వారి చేతుల మీదుగా సమితి అధ్యక్షులు వి.ఎల్.గాంధీకి అందించారు. లైన్స్ క్లబ్ (ఎలైట్) కాకినాడ ప్రెసిడెంట్ ఎన్.వి. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సమితివారు నిర్వహిస్తున్న స్కూలు క్రమశిక్షణతో ఉందని అభినందించారు. మంజులూరి విశ్వేశ్వరరావు మాట్లాడుతూ తిరుపతి వంటి పుణ్యక్షేత్రాలకు వెళ్ళినప్పుడు కలిగిన అనుభూతి ఈ సమితి ప్రాంగణంలోకి వచ్చినప్పుడు కలిగిందని, వివిధ రకాల సేవలను అందిస్తున్న సమితి సభ్యులకు ధన్యవాదాలు తెలియజేస్తూ, తన వంతుగా రూ.5వేలు విరాళంగా అందించారు. సమితి అధ్యక్షులు వి.ఎల్.గాంధీ మాట్లాడుతూ 1985లో ప్రారంభమయిన ఈ సేవా సమితి దాతల సహాయంతో చేస్తున్న సేవలను వివరించారు. ఈ కార్యక్రమానికి సమితి గవర్నింగ్ బాడీ సభ్యుడు కె.ఎస్.ఎన్.మూర్తి ఆహుతులకు ఆహ్వానం పలుకగా, స్కూలు ప్రధానోపాధ్యాయుడు కె.అప్పారావు వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ సభ్యులు, సమితి సభ్యులు, స్కూలు టీచర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థినీ విద్యార్థుల చదువు బాధ్యత మాదే..

**- తల్లిదండ్రులు కూడా పిల్లలపై బాధ్యతగా ఉండాలి**
**- ఫీడ్ బ్యాక్ ప్రోగ్రామ్లో ఉపాధ్యాయులు మాదిరెడ్డి రామలక్ష్మీ**



**వి.ఆర్.పురం, మేజర్ న్యూస్ :** చదువు, క్రమశిక్షణ (విద్యార్థినీ విద్యార్థుల) బాధ్యత మేము తీసుకుంటాం, మీ పర్యవేక్షణ తప్పని సరిగా ఉండాలని అబ్దుల్ కలాం, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాదిరెడ్డి రామ లక్ష్మీ సూచించారు. ప్రతీ రెండవ శనివారం,ఫీడ్ బ్యాక్ ప్రోగ్రామ్లో భాగంగా అబ్దుల్ కలాం,స్కూల్లో విద్యాభ్యసి స్తున్న విద్యార్థినీ, విద్యార్థుల ఇంటికి వెళ్లి తల్లిదండ్రుల అడిగి తెలుసు కున్నారు. ఇంటి వద్ద కూడా తల్లిదండ్రులు భాద్యతలు కలిగి ఉండాలని సూచించారు. ఏజెన్సీలో ఫీడ్ బ్యాక్ గురించి తెలుసుకు నేందుకు,అబ్దుల్ కలాం నిర్వాహకులు ప్రయత్నం చేయడం ఏజెన్సీలో ఇదే ప్రప్రథమంగా చూస్తున్నాం,వింటున్నాం,ఈ విద్యా బోధనతో పాటు ఆహ్లాదకర వాతావరణంలో(పాఠశాల ఆవరణలో) వ్యాసరచన పోటీలు,డిబేట్, గేమ్స్, సాంస్కృతిక కార్యక్రమాలు, నిర్వహిస్తూ!అద్భుతమైనరీతిలో విద్యార్థులను ఎప్పటికప్పుడు తీర్చిది ద్దడంలో ప్రతిభ కనబరుస్తూ మండలంలో ప్రత్యేకత చాటుకో వడంలో ముందు వరసలో ఉన్నారు.ఏది ఏమైనా మన్యంలో ఇలాం టి పాఠశాల ఉండటం వరరామచంద్రాపురం వాసుల అదృష్టంగా భావిద్దాం.

## ఎపిపిగా రాగం కామేశ్వరరావు

**- ఎపిపిని అభినందించిన దవులూరి**



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం సీనియర్ సివిల్ జడ్జి మరియు అసిస్టెంట్ సెషన్ జడ్జి కోర్టు ఎపిపిగా సీనియర్ న్యాయవాది రాగం కామేశ్వరరావును ప్రభుత్వం ఇటీవల నియమించింది. ఈ సందర్భంగా పెద్దాపురం వైసిపి నియోజకవర్గ ఇన్చార్జి దవులూరి దొరబాబును ఎపిపి కామేశ్వరరావు మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. దీనిలో భాగంగా దవులూరి క్యాంప్ కార్యాలయం నందు దొరబాబు కామేశ్వరరావును సత్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు వేదుల సుబ్రహ్మణ్యం (మణి), న్యాయవాదులు సాదె నరసింహరావు, మడికి రాంబాబు, అత్తిలి ప్రభూజీ, దుర్గారావు, విజయలక్ష్మీ, విశాలాక్షి, మానవ హక్కుల సంఘం అధ్యక్షులు నూతలపాటి అప్పలకొండ, రెహమాన్, పలువురు న్యాయవాదులు, శ్రేయోభిలాషులు ఎపిపి రాగంను అభినందించినవారిలో ఉన్నారు.

# స్వచ్ఛత మన బాధ్యత

**- ధవలేశ్వరంలో మంత్రి వేణుగోపాలకృష్ణ సుడిగాలి పర్యటన**
**- ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకున్న మంత్రి**
**- ఐఓసీఎల్ కాలనీలో శానిటేషన్ పనులను పరిశీలించిన మంత్రి**
**- మంత్రి వేణుగోపాల కృష్ణ**



**ధవళేశ్వరం, మేజర్ న్యూస్ :** స్వచ్ఛత మన బాధ్యత అని ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు, కాలుష్య నివారణకు తమ వంతు సహకారాన్ని అందించడం వల్ల మనం నివసించే గ్రామ, పట్టణాలను కాలుష్య రహిత ప్రాంతాలుగా తీర్చిదిద్దుకోగలమని జిల్లా ఇన్చార్జి మంత్రి బీసీ సంక్షేమం రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు సినిమా ఆటోగ్రాఫీ శాఖ మంత్రి మరియు రాజమండ్రి రూరల్ నియోజకవర్గం కోఆర్డినేటర్ శ్రీ చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ పేర్కొన్నారు. శనివారం మంత్రి వేణుగోపాలకృష్ణ రాజమండ్రి రూరల్ నియోజకవర్గం ధవలేశ్వరం, ఐఓసీఎల్ కాలనీలను పర్యటించి పలు డ్రైనేజీ, పార్కుల పరిశుభ్రత, విద్యుత్ దీపాలు వంటి పలు సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారం నిమిత్తం అధికారులు ఆదేశాలు జారీచేశారు. ఈ సందర్భముగా మంత్రి వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ స్వచ్ఛతతో కూడిన పరిసరాల పరిశుభ్రత ఎంతో అవసరమనిఆ దిశగా సంబంధిత శాఖల అధికారులు ప్రజలకు మెరుగైన శానిటేషన్ కల్పించే దిశగా తగు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి పట్టణ, గ్రామాల్లోని ప్రతి వార్డులో డ్రైనేజీ మురుగునీరు పారుదల, మెరుగైన శానిటేషన్, సెప్టిక్ ట్యాంక్ మరమ్మత్తులు, స్ట్రీట్ లైట్స్ నిర్వహణ వంటి పలు అంశాలకు సంబంధించిన ఎటువంటి సమస్యలు ఉండకూడదని సంబంధిత అధికారులు కార్యాచరణతో పనుల నిర్వహణ చేపట్టాలన్నారు. రాజమండ్రి రూరల్ ప్రాంతంలోని ప్రతి వార్డును పరిశీలించి స్వచ్ఛతే లక్ష్యంగా పరిశుభ్రతకు సంబంధించి సమస్యల యొక్క శాశ్వత పరిష్కారం తెలుసుకోవడంతో పాటు కొన్ని సమస్యలను అక్కడకు అక్కడే పరిష్కరిస్తున్నామన్నారు. గుడ్ మార్నింగ్ కార్యక్రమంలో భాగంగా గతవారం ఐవోసీఎల్ కాలనీలో చేపట్టి చేస్తున్న పలు పనులను పరిశీలించి ఇంకా మెరుగైన శానిటేషన్ చేయించే విధంగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి వేణుగోపాలకృష్ణ ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలు స్వయంగా అడిగి తెలుసుకున్నారు. రూరల్ నియోజకవర్గ ప్రజలు ఏకష్టం వచ్చినా సంకోచం లేకుండా తనకు వివరిస్తే పరిష్కరించడం జరుగుతుందని మంత్రి వేణుగోపాలకృష్ణ తెలిపారు. అనంతరం ఐవోసీఎల్ కాలనీలో సంకల్పం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పీచ్ ట్రైనింగ్ మరియు చెవిటి, మూగ ఆశ్రమ పాఠశాల సందర్శించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎస్ఈ పాండురంగారావు, ఎంపీడీవో శ్రీనివాసరావు, అధికారులు,సిబ్బందినాయకులుతదితరులు పాల్గొన్నారు.

# ఏపి ఈఏపిసెట్ -2024 కార్యాలయం ప్రారంభం



**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి నేతృత్వంలో జెఎన్టియుకె ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్, అగ్రికల్చర్ & ఫార్మశీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపి ఈఏపిసెట్)-2024 కార్యాలయాన్ని జెఎన్టియుకె పరిపాలనా భవనంలో శనివారం ఉదయం ఏపి ఈఏపిసెట్ ఛైర్మన్ మరియు ఉపకులపతి ప్రొ. జి.వి.ఆర్.ప్రసాదరాజు ప్రారంభించారు. ఏపి ఈఏపిసెట్ కన్వీనర్ & డిఏపి ప్రొ. కె.వెంకటరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఛైర్మన్ & ఉపకులపతి ముఖ్యఅతిథిగా విచ్చేసి పూజలు నిర్వహించి కార్యాలయాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఏపి ఈఏపిసెట్ ఛైర్మన్ & ఉపకులపతి ప్రొ. జి.వి.ఆర్.ప్రసాదరాజు మాట్లాడుతూ జెఎన్టియుకె కాకినాడ విశ్వవిద్యాలయం వరుసగా ఏడుసార్లు ఈఏపిసెట్ పరీక్షలను ఎటువంటి అవరోధాలు లేకుండా దిగ్విజయంగా నిర్వహించడం జరిగిందన్నారు. ఏపి ఈఏపిసెట్ పరీక్షలను ఎటువంటి అవరోధాలకు తావులేకుండా షెడ్యూల్ ప్రకారం నిర్వహించేందుకు తగిన చర్యలు చేపట్టడం జరుగుతుందని, త్వరలోనే పరీక్షల షెడ్యూల్ను విడుదల చేస్తామన్నారు. ఏపి ఈఏపిసెట్ కన్వీనర్గా డిఏపి ప్రొ.కె.వెంకటరెడ్డిని నియమించడం జరిగిందని, కో-కన్వీనర్లుగా అలూమ్ని రిలేషన్స్ సెల్ స్పెషల్ ఆఫీసర్ ప్రొ.ఎన్.మోహన్రావు, ఈఈఈ ప్రొఫెసర్ డా. ఎం.నాగేశ్వరరావు, కో-ఆర్డినేటర్లుగా డా. ఎన్.సుమతి, డా. ఆర్.మధు, డా. కె.కృష్ణభాస్కర్లను నియమించామన్నారు. ఈ కార్యక్రమంలో డిఏపి & పిఆర్ఓ ప్రొ. సి.హెచ్.సాయిబాబు, డిఇ ప్రొ. బి.బాలకృష్ణ, ఓడిఎల్ డైరెక్టర్ ప్రొ. కె.వి.ఎస్.జి.మురళీకృష్ణ, ఛీఫ్ ఇంజనీర్ ప్రొ. వి.శ్రీనివాసులు, డిఏ ప్రొ. ఏ.ఎం.ప్రసాద్, యుసిఇకె ప్రిన్సిపాల్ ప్రొ. ఎం.హెచ్.ఎం.కృష్ణప్రసాద్, డిఎంసి స్పెషల్ ఆఫీసర్ ప్రొ. ఏ.ఎస్.ఎన్.చక్రవర్తి, సిఇ (పిజి) ప్రొ. డి.హరిత, నాన్ టీచింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబు జగన్ వెన్నుపోట్లకు బలైన దొరబాబు, వర్మ



గొల్లప్రోలు, మేజర్ న్యూస్ : పిఠాపురం రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి ఏ పార్టీలో నాయకుడు పోటీ చేస్తాడో ప్రజలకు తెలియని పరిస్థితి నెలకొంది. పిఠాపురం వైఎస్ఆర్ పార్టీ ఎమ్మెల్యే పెండెం దొరబాబును కాదని ఆపార్టీ అధిష్టానం అదే పార్టీకి చెందిన కాకినాడ ఎంపీ వంగా గీతకు పిఠాపురం వైయస్సార్ పార్టీ ఇన్చార్జిగా బాధ్యతలు అప్పగించిన సంగతి అందరికీ తెలిసిందే. అలాగే పిఠాపురం నియోజకవర్గం తెలుగుదేశంపార్టీ అభ్యర్థిగా చెప్పుకునే ఇంచార్జ్ ఎస్ ఎస్ ఎన్ వర్మకు జనసేన టిడిపిపొత్తులో భాగంగా పిఠాపురం టిడిపి సీటు అందనిద్రాక్షలా మారింది. దీనిపై వర్మ అంధకారంలో వెలుతురు కోసం వెతుకులాట ప్రారంభించారు అని ఆయన అభిమానులనుండి వినిపిస్తున్న గుసగుసలు ఇప్పటికే పిఠాపురం నియోజకవర్గంలో జనసేన టిడిపి నేతల ఆదిపత్యం పోరు లో ఒకరిపై ఒకరు కారాలు మిరియాలు నూరుతున్నారు. నియోజకవర్గంలో వర్మకు10,000 సొంత బలం ఉందంటే జనసేన పార్టీ నాయకుడు తంగేళ్ల ఉదయ్కు జనసేనపార్టీ అధినేత పవన్ కళ్యాణ్తో పాటు జనసైనికుల అండదండలు ఉన్నాయని ఉదయ శ్రీనివాసు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే పిఠాపురం నియోజకవర్గంలో ప్రజారాజ్యం పార్టీలో ఎమ్మెల్యేగా వైయస్సార్ పార్టీలో కాకినాడ ఎంపీగా నిరంతరం ప్రజల్లో తిరుగుతూ ప్రజా సమస్యల పరిష్కరిస్తూ రాజకీయ సేవలందిస్తున్న వంగాగీత ప్రజలే దేవుళ్ళుగా కార్యకర్తలే నమ్మకం అంటూ ప్రజల్లోకి దూసుకుపోతున్నారు. టిడిపి జనసేన నాయకులు బలాన్ని ప్రకటించుకుంటే మేధావి రాజకీయ చతురత కలిగిన మహిళా ఎలాంటి సమస్యనైనా శాంతియుతంగా పరిష్కరించగలిగే మహిళా న్యాయవాదిగా ప్రజలే ఆమె బలంగా చెప్పుకుంటున్నారు. ఇదిలా ఉంటే టిడిపి వైసిపి అధిష్టానాలు కొట్టిన దెబ్బకు ఇద్దరునే తలకు దిమ్మ తిరిగి బొమ్మ కనిపించడంతో రాజకీయ వ్యూహాలకు పదునుపెట్టారు. దొరబాబు వర్మ కమలంపార్టీ తీర్థం పుచ్చుకునేందుకు సిద్ధంగాఉన్నట్లు బిజెపి వర్గాల నుండి వినిపిస్తున్న సమాచారం. బిజెపి పార్టీలో మంచి పట్టున్న దొరబాబు కమలం గుర్తుపై బరిలో నిలబడతారా..? పిఠాపురం ఎన్నికల బరిలో 2014 లో స్వతంత్ర అభ్యర్థిగా వర్మ 48 వేలఓట్లుతో విజయం సాధించారు. పిఠాపురం రాజకీయచరిత్రలో వర్మ రికార్డు అధిగమించే నాయకుడులేడనే చెప్పాలి మరి మళ్లీ వర్మకు స్వతంత్ర అభ్యర్థి పోరు తప్పేలా లేదు.. ప్రజలు ఎవరికి పట్టం కడతారో పిఠాపురం కోటపై ఏ పార్టీ జెండా రెపరెపలాడుతుందో కొద్ది రోజులు వేచి చూడాలి మరి.

## ఆడుదాం ఆంధ్ర క్రికెట్ పోటీలలో సామర్లకోట జట్టు విజయం



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లో భాగంగా వైజాగ్లో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో కాకినాడ జిల్లా సామర్లకోటకు చెందిన జట్టు శనివారం విజయం సాధించింది ఇటీవల మండల స్థాయి నియోజకవర్గ స్థాయి జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి సామర్లకోట బల్ల మార్కెట్ సచివాలయం కు చెందిన జట్టు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విషయం విదితమే. కాగా రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలను వైజాగ్ లో నిర్వహిస్తుండగా శనివారం జరిగిన మ్యాచ్ లో పుట్టపర్తి సత్యసాయి జిల్లా జట్టు పై కాకినాడ జిల్లా సామర్లకోట జట్టు 23 పరుగుల తేడాతో విజయం సాధించింది. నిర్ణీత 8ఓవర్లకు సామర్లకోట జట్టు 93 పరుగులు చేయగా పుట్టపర్తి సత్యసాయి జిల్లా జట్టు నిర్ణీత ఓవర్ల లో కేవలం 70 పరుగులు మాత్రమే చేయడంతో కాకినాడ జట్టు విజయం సాధించింది. ఈ మ్యాచ్ లో కాకినాడ జిల్లా జట్టు లో మని 8 బంతుల లో 24 పరుగులు,అనిల్ 17బంతుల లో 34 పరుగులు సాధించి జట్టు విజయానికి కృషి చేశారు. కాకినాడ జిల్లా జట్టు క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ ఆదివారం జరగనుంది.

## ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్షలు



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** నవోదయ విద్యాలయలో 9వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో చెరెందుకు గానూ ప్రస్తుతం 8వ తరగతి, పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రవేశ పరీక్షలు శనివారం ప్రశాంత వాతావరణంలో జరిగాయి. మండల విద్యా శాఖధికారి వై శివ రామ కృష్ణయ్య పర్యవేక్షణలో గవర్నమెంట్ బాలుర ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికొన్నత పాఠశాలల్లో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ జరిగాయి. ఈ పరీక్షలకు సెంటర్ లెవెల్ పరిశీలకులుగా వి జగన్ మోహన్ రావు వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరానికి సంభందించి 9వ తరగతిలో చేరేందుకు దరఖాస్తు చేసుకున్న ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్న విద్యార్డులకు నాలుగు సెంటర్లలోనూ, ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరేందుకు గానూ ప్రస్తుతం పదవ తరగతి చదువుతున్న విద్యా ర్థుల కోసం పెద్దాపురంలో రెండు కేంద్రాల్లో ఈ పరీక్షలు జరుగుతున్నట్టు చెప్పారు. ఎంఇవో శివ రామ కృష్ణయ్య మాట్లాడుతూ అన్ని కేంద్రాల్లో నవోదయ ప్రవేశ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యార్థులంతా పరీక్షలు రాస్తున్నారని చెప్పారు. ఈ పరీక్షలకు 192 మంది హాజరు కావాల్సి ఉండగా 117 మంది హాజరయ్యారు. ఈ పరీక్షల కుఇన్విజీలేటర్లుగాఉపాధ్యాయులు వ్యవహరించి సేవలనందించారు.

### ఆదిత్య డిగ్రీ కళాశాలలో " ఉన్నత విద్యలో సంస్కరణలు - యువత సాధికారత" పై సదస్సు



**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఈనెల 12వ తేదీ సోమవారం ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో "ఉన్నత విద్యలో సంస్కరణలు - యువత సాధికారత" పై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి ఈ వి ఎల్ నాయుడు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఉన్నత విద్యను భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మార్చడంలో అనేక కార్యక్రమాలను చేపట్టింది. ఇది విద్యార్థులలో విశ్లేషణాత్మక నైపుణ్యాలు, వ్యవస్థాపకత మరియు సమాజ సేవను అభివృద్ధి చేయడానికి, భవిష్యత్ సవాళ్లకు మరియు తాజా సాంకేతికతలలో భవిష్యత్తు నైపుణ్యాల కోసం వారిని సిద్ధం చేయడానికి కూడా కృషి చేస్తుంది. ఈ సందర్భంలో క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ రాష్ట్రంలోని అనుబంధ కళాశాలల విద్యార్థులతో "ఉన్నత విద్యలో సంస్కరణలు- యువ సాధికారత"పై వరుస పరస్పర చర్యలను నిర్వహించాలని భావిస్తోంది. ఈ సందర్భంగా సోమవారం ఉదయం 10:30 గంటలకు ఆదిత్య డిగ్రీ కళాశాలలో జరగనుంది. ఈ కార్యక్రమా నికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ వైస్ చైర్మన్ డాక్టర్ కె రామ్మోహనరావు, గౌరవ అతిథిగా కాకినాడ జేఎన్టీయూ ఉపకులపతి డాక్టర్ జి.వి.ఆర్ ప్రసాద్ రాజు విచ్చేస్తున్నారని డైరెక్టర్ డాక్టర్ నాయుడు తెలిపారు.

## శృంగార వల్లభ స్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులు



పెద్దాపురం, మేజర్ న్యూస్ : పెద్దాపురం మండలం, తిరుపతి గ్రామంలో వేంచేసియున్న శ్రీశ్రీ శృంగార వల్లభ స్వామిని శనివారం వేలాది సంఖ్యలో భక్తులు దర్శించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా కార్యనిర్వాహణాధికారి వడ్డి శ్రీనివాసరావు, మరియు దేవస్థాన ఛైర్మన్ కర్రి జగదీశ్వరరావులు మాట్లాడుతూ ప్రత్యేక దర్శనం టికెట్ల ద్వారా రూ.3,09,150/–, అన్నదాన విరాళాల ద్వారా రూ.73,077/–లు, కేశఖండన ద్వారా రూ.5,920/–, తులాభారం ద్వారా రూ.650/– వెరశి రూ.3,88,797/–లు స్వామివారికి ఆదాయం రావడం జరిగిందని తెలిపారు. అలాగే దేవస్థానం తరపున ఉదయం పులిహోర ప్రసాదం పంపిణీ చేశారు. అనంతరం భక్తులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొని, స్వామి వారి ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు పెద్దింటి నారాయణాచార్యులు, పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి గోపాలాచార్యులు, ఎంపిటిసి కుంచె బుచ్చిరాజు, దేవస్థాన కమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది కృష్ణ, మోహనరావు, సత్యనారాయణ, ఇతర స్వచ్చంద సేవకులు, వేలాది సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## అరాచక పాలనపై లోకేష్ పూరిస్తున్న సమర నాదమే ఈ శంఖారావం - గొర్రెల శ్రీధర్

కొవ్వూరు, మేజర్ న్యూస్ : గడిచిన 4 సంవత్సరాల 9 నెలల కాలంలో జగన్మోహన్ రెడ్డి సాగించిన అరాచక పాలనపై లోకేష్ పూరిస్తున్న సమర నాదమే ఈ శంఖారావం అని కొవ్వూరు నియోజకవర్గం పరిశీలకులు గొర్రెల శ్రీధర్ అన్నారు. శనివారం తెలుగుదేశం పార్టీ కొవ్వూరు నియోజకవర్గం ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ చౌదరి, కంఠమనేని రామకృష్ణ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాలన చేపట్టిన నాటి నుంచి అరాచక పాలన సాగిస్తున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో మోసపోయిన యువత కోసం రక్షణ లేకుండా పోయిందని, మహిళల కోసం దగాపడ్డ ఆంధ్రుల గొంతుకై యువగళం పాదయాత్ర కొనసాగించారన్నారు. దాదాపు 220 రోజుల పాటు 3132 కిలోమీటర్లు సుదీర్ఘ పాదయాత్ర చేసి వారిలో చైతన్యం నింపడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా నేరుగా పార్టీ నాయకత్వంతో మమేకమవుతారని అన్నారు. ఈ శంఖారావం ద్వారా బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ పథకాలను ప్రతి ఇంటికి తీసుకెళుతు ప్రభుత్వ అరాచక విధానాలను ప్రజలకు తెలియజేస్తారని అన్నారు. ఈకార్యక్రమంలో దాయన రామకృష్ణ, మాదిరెడ్డి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# అందరి చూపు పవన్ వైపు.. పవన్ చూపు ఆయన వైపు

కాకినాడ, మేజర్ న్యూస్ : రాష్ట్రవ్యాప్తంగా ఆ నియోజకవర్గం చర్చనీయాంశంగా మారింది. జనసేన అక్కడ అత్యంత బలంగా ఉంది. కానీ ఐటీవల జరిగిన సంఘటనలు ఆ పార్టీని డైలమాలో పడేసాయి. ఇబ్బందులు పాలు చేసాయి. దీంతో పవన్ కళ్యాణ్ కొత్త అభ్యర్థిని పరిశీలిస్తున్నట్లు సమాచారం. పవన్ కళ్యాణ్ పిఠాపురం నుంచి పోటీ చేయాలంటూ ఇప్పటికే ఆయనపై ఒత్తిడి పెరిగింది. ఆయన ఎటూ తేల్చలేదు. ఇలాంటి నేపథ్యంలో ఇప్పటికే పిఠాపురంలో రెండవ కృష్ణుడు తెరపైకి వచ్చారు. మాకినీడి శేషుకుమారిని తప్పించారు. ఉదయ శ్రీనివాస్‌కు బాధ్యతలు అప్పగించారు.

ఆయనపై కూడా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వారం రోజుల క్రితం జనసేన పిఠాపురం పార్టీ కార్యాలయం వద్ద మాదేపల్లి శ్రీనివాస్ అనే వ్యక్తిపై రెక్కీ నిర్వహించి హత్యయత్నం చేశారు అంటూ జనసేన ఇంచార్జ్ ఉదయ్ శ్రీనివాస్ వర్గానికి చెందిన దాసరి కిరణ్ కుమార్ మీడియా సమావేశం పెట్టారు. పోలీసులు వచ్చారు. సీసీ కెమెరా ఫుటేజ్ తీసుకున్నారు. ఎవరిమీదైతే ఆరోపణలు చేసారో వారిని విచారించారు. అయితే ఎలాంటి రెక్కీ జరగలేదు, ఇది హత్యాయత్నం కాదని పిఠాపురం పోలీసులు చెబుతున్నారు. ఇంతవరకు ఎవరిని అరెస్ట్ చేయలేదు. దీనికి తోడు ఎవరైతే నిందితులు ఉన్నారో వారి తల్లులు కూడా బహిరంగంగా స్టేట్మెంట్ ఇచ్చారు. తాము దళితులమని కావాలని తమపై ఇలాంటి తప్పుడు కేసులు పెడుతున్నారని ఆరోపణలు చేసారు. ఈ నేపథ్యంలో పవన్ కళ్యాణ్ మరో అభ్యర్థిని తెరపైకి తెచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు. విద్యావేత్త, కాపు సామాజిక వర్గంలో అర్ధబలం, అంగ బలం పుష్కలంగా ఉండి [illegible], అజాతశత్రువుగా పేరిందున కడారి తమ్మయ్య నాయుడు వైపు చూస్తున్నారు. ఆయన అభ్యర్థిత్వాన్ని ఇప్పటికే పరిశీలించారు. రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యులు నాదెండ్ల మనోహర్ కూడా ఆయనతో చర్చించారు. ముఖ్యంగా తమ్మయ్య నాయుడు కుటుంబం స్వాతంత్ర సమరయోధులకు చెందినది. అదేవిధంగా మాజీ మంత్రి దివంగత కొప్పన మోహనరావు సమీప బంధువులు. దీంతో నాయుడు అభ్యర్థిత్వాన్ని స్థానికులు తెరపైకి తీస్తున్నారు. ఈసారి కచ్చితంగా స్థానికుడికి టిక్కెట్ ఇవ్వాలి. లేదా పవన్ కళ్యాణ్ పోటీ చేయాలి. స్థానికేతరులకిస్తే సహకరించేది లేదు. వర్మ వైపు వెళ్ళిపోతామంటూ పలువురు ఇప్పుడే సంకేతాలు ఇచ్చారు. దీనికి తోడు వర్మ, సిట్టింగ్ వైసీపీ ఎమ్మెల్యే దొరబాబు బీజేపీ వైపు తొంగి చూస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ఒకసారి బిజెపి టిడిపి మద్దతుతో బిజెపి టికెట్‌పై దొరబాబు గెలిచారు. ఈనేపథ్యంలోనే బలమైనఅభ్యర్థిగా వివాదరహితుని గా ఉన్న తమ్మయ్య నాయుడుని జనసైనికులు ముందుకు తెస్తున్నారు. పవన్ కళ్యాణ్ కూడా ఇప్పటికే రెండుసార్లు దీనిపై చర్చించినట్లు సమాచారం.





## శృంగార వల్లభ స్వామి దేవస్థాన ఇఓగా 'వడ్డి శ్రీనివాసరావు' బాధ్యతలు స్వీకరణ



పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ : పెద్దాపురం మండలం, తొలితిరుపతి గ్రామంలో వేంచేసియున్న శ్రీశ్రీ శృంగార వల్లభ స్వామి దేవస్థానం కార్యనిర్వాహణాధికారిగా వడ్డి శ్రీనివాసరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కాకినాడ జిల్లా, పిఠాపురం శ్రీ కుక్కుటేశ్వర స్వామి వారి ఆలయ ఇఓగా పనిచేస్తూ సాధారణ బదిలీలలో భాగంగా ఇక్కడకు రావడం జరిగింది. ముందుగా స్వామి వారిని దర్శనం చేసుకుని అనంతరం దేవస్థాన ఛైర్మన్ కర్రి వెంకట జగదీశ్వరరావును మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఇప్పటివరకు ఇక్కడ ఇఓగా విధులు నిర్వహిస్తున్న పులి నారాయణమూర్తి అసిస్టెంట్ కమీషనర్‌గా పదోన్నతి పొంది పిఠాపురం శ్రీ కుక్కుటేశ్వర స్వామి వారి ఆలయ అసిస్టెంట్ కమీషనర్‌గా వెళ్ళడం జరిగింది.

## మరోసారి వై.సీ.పిని గెలిపించండి

– ఎమ్మెల్సీ అనంతబాబు, ఎమ్మెల్యే ధనలక్ష్మి వాహన యాత్ర



దేవీపట్నం, మేజర్ న్యూస్ : మండలంలో ప్రజూలాబాద్, ఇందుకూరు, ఇందుకూరుపేట రావిలంక, పోతవరం, శరభవరం, దేవారం, పలు గ్రామాల్లో ఎమ్మెల్సీ అనంత బాబు, ఎమ్మెల్యే ధనలక్ష్మి వాహన యాత్రవైసిపి పార్టీ ఆధ్యర్యంలో కార్యక్రమం నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పలు గ్రామాల సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి మన ప్రభుత్వం వస్తోందని,ప్రజల ఆశీస్సులు ఎప్పుడూ వై.ఎస్.ఆర్.కాంగ్రెస్ పార్టీకి ఉండాలనిఅన్నారు. అనంతరం ఎమ్మెల్సీ, అనంతబాబు టీ.డీ.పి. పార్టీని ఉద్దేశించి మాట్లాడుతూ త్వరలో ఎన్నికలు వస్తున్నాయని,0 మళ్లీ టీడీపీ నాయకులు మోస పూర్వక పథకాలు తెరమీదకు తెచ్చి మోసాలు చేస్తారని, ప్రజలందరూ తెలుగుదేశం పార్టీని నమ్మొద్దని, గతంలో టి.డి.పి పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు చేసింది ఏమి లేదని అన్నారు, మీరందరూ మరొక్కసారి వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని అన్నారు. గానుగ గొంది, దండంగి పలు గ్రామాలు ప్రజలు మాకు త్రాగునీరు సమస్య ఎక్కువగా ఉందని ఎమ్మెల్సీ అనంత బాబు దృష్టికి తీసుకెళ్లగా, ఎం.ఎల్..సీ. సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం గానుగుల గొందిలో ఒక ఆలయానికి సంబంధించిన మెస్ గేట్లు ఏర్పాటు చేస్తానన్నారు. పోతవరం బాపనమ్మ తల్లి జాతరకుగ్రామస్తులకు 10.000 రూ. అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గారపాటి మురళి, ఎంపీపీ కె. మురళి,జిల్లా ఉపాధ్యక్షుడు కందుల బాబ్జి,నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## జనసేన ఆధ్వర్యంలో పిఠాపురంలో మెగా జాబ్ మేళా

– నిరుద్యోగులకు అండగా జనసేన ఉంటుంది
– జనసేన ఎన్నారై సేవా కో ఆర్డినేటర్ కొలికొండ శశిధర్



పిఠాపురం, మేజర్ న్యూస్ : నిరుద్యోగులకు అండగా జనసేన ఉంటుందని జనసేన ఎన్నారై సేవా కో ఆర్డినేటర్ కొలికొండ శశిధర్ అన్నారు. పిఠాపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యువకులకు పిఠాపురం స్థానిక కేవికేటీ ఫంక్షన్ హాల్ నందు మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ మెగా జాబ్ మేళా నందు సుమారు 2500 మంది నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొన్నారు. వివిధ 54 కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించగా 586 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారని నిర్వాహకులు తెలిపారు. జనసేన ఎన్నారై సేవా కో ఆర్డినేటర్ కొలికొండ శశిధర్ మాట్లాడుతూ... పవన్ కళ్యాణ్ ఆశయాల సాధనే లక్ష్యంగా పని చేస్తామని, పార్టీ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.జనసేన రవి కుమార్ పర్యవేక్షణలో... ప్రతీ కంపెనీకి ఒక స్టాల్ ఏర్పాటు చేసి స్టాల్ నంబర్లు బోర్డులు ఏర్పాటు చేయడంతో నిరుద్యోగులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు, జనసేన పార్టీ యువత తదితరులు పాల్గొన్నారు.

## తాటిపర్తిలో తృతీయ సప్తాహ మహోత్సవాలు

– ఆర్గనైజర్ గోపు సూరిబాబు



పెద్దాపురం, మేజర్ న్యూస్ : పెద్దాపురం మండలం, బి.తాటిపర్తి గ్రామంలో వైభవ ంగా శనివారం ప్రారంభమైన తృతీయ సప్తాహ మహోత్స వాలలో భాగంగా పలు భజన సమాజాలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా శ్రీ కోదండరామ బాలభక్త భజన సమాజం సభ్యులు మరియు ఆర్గనైజర్ గోపు సూరిబాబు తెలిపారు. ఆయన స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ ఈ తృతీయ సప్తాహ మహోత్సవములు స్థానిక శ్రీ సిద్ధి వినాయక గుడి వద్ద నేటి ఉదయం 6 నుండి ప్రారంభమయ్యాయని ఆయన తెలిపారు. ఈ సప్తాహ మహోత్సవంలో వివిధ గ్రామాల నుండి భజన బృందాలు, మహిళా భజన సమాజాలు, పాల్గొనున్నాయని, ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజలు, గ్రామ నాయకులు, సహాయ సహాకారాలతో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని సూరిబాబు తెలిపారు. కావున ఈ తృతీయ సప్తాహ మహోత్సవాలలో భక్తులు పాల్గొనాలని, అలాగే 17వ తేది శనివారం మధ్యాహ్నం మహాన్నదాన సంతర్పణ నిర్వహించబడునని, కావున వేలాది సంఖ్యలో భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించాలని ఆయన తెలిపారు.

## బ్యారేజ్ రహదారి పనులు మరమ్మత్తుల నిమిత్తం మరో 5 రోజులు మూసివేత

– క్యూరింగ్ పనుల నిమిత్తం ఇరిగేషన్ అధికారులు విజ్ఞప్తి మేరకు నిర్ణయం
– మరమ్మత్తుల అనంతరం యధావిధిగా ట్రాఫిక్‌కి అనుమతి
–కలెక్టర్ మాధవీలత



ధవళేశ్వరం, మేజర్ న్యూస్ : బ్యారేజ్ మరమ్మత్తు పనుల కోసం ఫిబ్రవరి 10 వరకూ ట్రాఫిక్ మళ్లింపు ఉత్తర్వులను ఫిబ్రవరి 15 వ తేదీ వరకు పొడింగించడం జరిగిందనీ, ఆ మేరకు ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటించి సహకరించాలని జిల్లా కలెక్టర్ డా కె. మాధవీలత శనివారంఒక ప్రకటనలో తెలియ చేశారు. ధవళేశ్వరం బ్యారేజ్‌పై రూ.2కోట్లల ప్రతిపాదనలతో జరుగుతున్న పనులు ప్రస్తుతం కాంక్రీట్ క్యూరింగ్ పనుల నేపథ్యంలో మరో ఐదు రోజులు ట్రాఫిక్ మళ్లింపు కోసం ఇరిగేషన్ రివర్ కన్సర్వేటివ్ ఈఈ వి. కాశీ విశ్వేశ్వర రావు విజ్ఞప్తి మేరకు బ్యారేజ్ పై రహదారుల మరమ్మత్తు పనుల కోసం మరో ఐదు రోజులు ట్రాఫిక్ మళ్లించ నున్నట్లు తెలిపారు.పోలీస్ అధికారుల ద్వారా ట్రాఫిక్ మళ్లింపు చర్యలు , ఈ రహదారి నుండి ప్రయాణించే స్కూల్ బస్సుల యాజమాన్యాలు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా బస్సులు నడపాలని సంభందిత అధికారుల ద్వారా సమాచారం తెలియ చెయ్యడం జరిగిందన్నారు. కావున ప్రస్తుతం మరమ్మత్తు పనుల కీలక దశలో ఉన్న దృష్ట్యా ప్రజలు జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కలెక్టర్ కోరారు.

# పిడిఎస్ బియ్యం అక్రమ రవాణాపై నిరంతర నిఘా



రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ : రాజమహేంద్రవరం రీజనల్ విజిలెన్స్ & ఎన్ఫోర్స్మెంట్ పరిధిలోని మూడు జిల్లాలలో పి.డి.ఎస్ బియ్యం అక్రమ నిల్వలు, అక్రమ రవాణా పై నిరంతరం నిఘా కొనసాగుతుందని, ఎవ్వరైనా పి.డి.ఎస్‌బియ్యం కొనడం, అమ్మడం చేస్తే సదరు వ్యక్తుల పై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని రీజనల్ విజిలెన్స్ ఎస్.పి. కె.ఎస్.ఎస్.వి.సుబ్బారెడ్డి అన్నారు.

శనివారం తూర్పు గోదావరి జిల్లాలోని రాజానగరం మండలంలోని శ్రీరామ్ నగర్ గ్రామ సమీపములో అశోక్ లేలాండ్ ఎకోమెట్ స్టార్ వాహనం నంబర్ 9333లో పి.డి.ఎస్ రేషన్ బియ్యంతో వెళ్ళుతుంది అన్న సమాచారముతో విజిలెన్స్ అధికారులు, రెవెన్యూ మరియు సివిల్ సప్లయ్స్ అధికారులతో సదరు వాహనంను అదుపులోకి తీసుకోవడం జరిగింది. తనిఖీ చేయగా, సదరు వాహనం నందు 122 ప్లాస్టిక్ బస్తాలలో సుమారు 6100 కేజీల పి.డి.ఎస్ బియ్యంను గుర్తించటమైనది. సదరు వాహన యజమాని వెలుగుల కృష్ణ మరియు అతని భాగస్వామి వెలుగుల గురయ్య ఏ బాబ్జి, ప్రత్తిపాడు ఆదేశాల మేరకు పిడిఎస్ బియ్యాన్ని ఖమ్మం జిల్లా కల్లూరు గ్రామం నుండి గొల్లప్రోలు మండలం బి-ప్రత్తిపాడు గ్రామానికి రవాణా చేస్తున్నట్లు వాహన డ్రైవర్ కరణం సద్గురు మూర్తి, వీరాజు తెలియజేశారు. సదరు పి.డి.ఎస్ బియ్యంను అతని యజమానులు కల్లూరు మరియు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన కార్డుదారుల నుండి రూ.23/–లకు కొనుగోలు చేసి, బి-ప్రత్తిపాడు గ్రామ పరిధిలోని బ్రిక్స్ కార్మికులకు, చేపల చెరువులకు 26/–లకు విక్రయిస్తున్నారని తెలిపియున్నాడు. సదరు పి.డి.ఎస్ బియ్యంను అక్రమముగా తరలించుట కారణముగా సుమారు రూ 31,73,872/– లు విలువ గల 6100 కేజీల రేషన్ బియ్యంను మరియు పైన తెలిపిన వాహనంను సివిల్ సప్లయ్స్ అధికారులు, రాజానగరం వారు సీజ్ చేసి 6-ఏ క్రింద కేసు నమోదు చేసి సదరు పి.డి.ఎస్(రేషన్ బియ్యం) ఓనర్లు, వాహనం డ్రైవర్ మరియు సంబందిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు కొరకు పోలీసు స్టేషన్ కు సిఫారసు చేయటమైనదన్నారు. ఈ సందర్భముగా రీజనల్ విజిలెన్స్ ఎస్.పి. శ్రీ కె.ఎస్.ఎస్.వి.సుబ్బారెడ్డి, మాట్లాడుతూ రాజమహేంద్రవరం రీజనల్ విజిలెన్స్ & ఎన్ఫోర్స్మెంట్ పరిధిలోని మూడు జిల్లాలలో పి.డి.ఎస్(చౌక బియ్యం) అక్రమ నిల్వలు, అక్రమ రవాణా పై నిరంతరం నిఘా కొనసాగుతుంది అని, ఎవ్వరైనా పి.డి.ఎస్(చౌక బియ్యం) కొనడం, అమ్మడం చేస్తే సదరు వ్యక్తుల పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ తనిఖీలలో కార్యాలయ ఇన్స్పెక్టర్ నాగ వెంకటరాజు, తూర్పుగోదావరి పౌర సరఫరాల అధికారి భాస్కర్, రాజానగరం సి.ఎస్.డి.టి సుందర్, కానిస్టేబుల్స్ లోవరాజు, కిషోర్ మరియు రెవెన్యూ, సివిల్ సప్లయ్స్ అధికారులు పాల్గొన్నారు.

# అల్లూరి చరిత్రపట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం

– అల్లూరి తపస్సు చేసిన గోపాలపట్నం శివాలయానికి రోడ్డు వేయండి
– అల్లూరికి భారతరత్న ఇవ్వాలి – 125 రూపే నాణాన్ని విడుదల చేయాలి



తుని/పాయకరావుపేట, మేజర్‌న్యూస్ : స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు చరిత్రపట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు ఆరోపించారు. శనివారం జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం ప్రతినిధుల బృందం సంఘం ఉపాధ్యక్షురాలు వాడపల్లి వెంకటరమణమ్మ సారధ్యంలో సీతారామరాజు తపస్సు చేసిన గోపాలపట్నంలోని సీతమ్మ కొండపై ఉన్న రామలింగేశ్వర ఆలయం అల్లూరి చదువుకున్న తుని రాజా హైస్కూల్ ను సందర్శించారు. ఈ సందర్భంగా పడాల వీరభద్రరావు మాట్లాడుతూ సీతమ్మకొండపైఉన్న రామలింగేశ్వరాల యానికి సరైన రోడ్డు లేక సీతారామరాజు అభిమానులు, పర్యాటకులు, భక్తులు చాలా ఇబ్బందులు పడుతున్నారని వెంటనే రోడ్డును నిర్మించాలన్నారు. రోడ్డును నిర్మించాలని స్థానికులు పలుమార్లు మంత్రి దాడిశెట్టి రాజా దృష్టికి తీసుకువెళ్లగా ఆయన ఒకసారి ఆలయాన్ని సందర్శించి, రోడ్డును నిర్మిస్తామని హామీ ఇచ్చినా ఇప్పటి వరకు రోడ్డు నిర్మాణం జరగలేదని స్థానికులు ఆరోపిస్తున్నారని పడాల వీరభద్రరావు పేర్కొన్నారు.

**–అల్లూరి పేరున 125 రూపే నాణాన్ని విడుదల చేసి భారతరత్న ఇవ్వాలి**

యువజన సంఘం ప్రతినిధులు అల్లూరి చదువుకున్న తుని హైస్కూలును సందర్శించారు. ఈ సందర్భంగా పడాల వీరభద్రరావు మాట్లాడుతూ తెలుగుజాతి పౌరుష ప్రతాపాలను ప్రపంచానికి చాటి చెప్పి దేశం కోసం ప్రాణం త్యాగం చేసిన అల్లూరికి భారతరత్న బిరుదు ఇవ్వాలని, అలాగే నేతాజీ సుభాష్ చంద్రబోస్ జన్మించిన 1897లోనే అల్లూరి జన్మించాడని, నేతాజీ పేరున విడుదల చేసిన 125 రూపే నాణాన్ని అల్లూరి పేరట విడుదల చేయాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా హైస్కూలులో గతంలో కోటనందూరు అల్లూరి సీతారామరాజు సేవా కమిటీ ఏర్పాటు చేసిన అల్లూరి విగ్రహానికి జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం ఉపాధ్యక్షురాలు వాడపల్లి వెంకటరమణమ్మ, కార్యదర్శి శ్యామల వరలక్ష్మి అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం కార్యదర్శులు లక్కాకుల బాబ్జీ, శివంగి నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యుడు పోతిన వెంకటేశ్వరరావు, తుని రాజా హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు టి. శేషగిరి, ఉపాధ్యాయులు కిల్లాడ రమేష్, డి. నాగేశ్వరరావు, ఎం. స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

# పద్మనాభ నగర్‌లో వైసీపీ నుండి టిడిపిలోకి 50 కుటుంబాల చేరిక

– టిడిపిలోకి ఆహ్వానించిన జ్యోతుల నెహ్రూ, జ్యోతుల నవీన్





జగ్గంపేట, మేజర్ న్యూస్ : జగ్గంపేట పద్మనాభ నగర్ లో కస్టర్ ఇంచార్జ్ జీను మణిబాబు ఆధ్వర్యంలో మాజీ వార్డు సభ్యులు జనపరెడ్డి విష్ణు, రేల్లి రామకృష్ణ, ఆనంద దేవర శ్రీను, దామీరు రాంబాబు, గోపు కృష్ణ, బ్రహ్మచారి, టిడిపి కార్యకర్త కొప్పు శ్రీను ఆధ్వర్యంలో 10 కుటుంబాలు కలిపి 50 కుటుంబాలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజీనామాచేసి తెలుగుదేశం పార్టీలో చేరారు. రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ, కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ పార్టీలో చేరిన వారందరికీ టిడిపి కండువాలతో స్వాగతం పలికారు. ముందుగా జే.వి.ఆర్ సెంటర్ కు చేరుకున్న నెహ్రూ నవీన్ లకు మహిళలు మంగళ హారతులతో పూలమాలతో ప్రతి ఇంటి వద్ద ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జీను మణిబాబు మాట్లాడుతూ పద్మనాభ నగర్ లో ప్రతి వీధి సిమెంట్ రోడ్డు అయింది అంటే అది జ్యోతుల నెహ్రూ గారి వల్లే అని మళ్ళీ ఐదు సంవత్సరాలలో ఎక్కడ ఒక డ్రైన్ కూడా కట్టలేదని జ్యోతుల నెహ్రూ లాంటి వ్యక్తి మళ్ళీ గెలిస్తే ఈ ప్రాంతం అంతా అభివృద్ధి చెందుతుందని ఆయన గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉందని అన్నారు. నెహ్రూ మాట్లాడుతూ పాత కొత్త కలయికలో తెలుగుదేశం పార్టీ మరింత అవుతుందని మీ అందరి ఆశీస్సులతో రేపు రాబోయే ఎన్నికల్లో విజయంసాధించిన తర్వాత నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తానని అన్నా రు. ఈ ముఖ్యమంత్రి అన్ని వర్గాలను మోసం చేసి రాష్ట్రాన్ని అప్పులు కుప్పగా మార్చారని రాష్ట్రాన్ని కాపాడుకోవాలంటే టిడిపి, జనసేన సంకీర్ణ ప్రభుత్వం రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, పోతుల మోహనరావు, చదరం చంటిబాబు, కొత్త కొండబాబు, దేవరపల్లి మూర్తి, కందుల చిట్టిబాబు, పాండ్రంగి రాంబాబు, అడబాల వెంకటేశ్వరరావు, వీరం రెడ్డి కాశి బాబు, సుంకవిల్లి రాజు కందుల బాబ్జి, పైడిపాల సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

## 13 పుణ్యక్షేత్రాలను దర్శిస్తూ 13 రోజుల సూపర్ లగ్జరీ బస్సు యాత్ర



కొవ్వూరు, మేజర్ న్యూస్ : అయోధ్య యాత్రలో భాగంగా కొవ్వూరు డిపో నుంచి సూపర్ లగ్జరీ సర్వీస్‌గా పూరి, గయా, కాశి అయోధ్య మొదలగు 13 పుణ్యక్షేత్రాలను దర్శిస్తూ 13 రోజుల బస్సు యాత్ర చేయు భక్తులకు శనివారం కొవ్వూరు డిపో నుండి సూపర్ లగ్జరీ సర్వీసును ప్రారంభించామని డిపో మేనేజర్ వై.వి.వి.ఎన్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 5వ తారీఖున మొదటి బస్సు యాత్రకు బయలుదేరగా ఇది రెండో బస్సు బయలుదేరుతుందన్నారు. ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా బస్సులో నిష్ణాతులైన ఇద్దరు డ్రైవర్లను, ఒక మెకానిక్ ను పంపుతున్నామనిపంపుతున్నామన్నారు. యాత్ర ప్రదేశాలు పూర్తిగా తెలిసిన ఆర్టీసీ అధికారి గైడ్గా వెళ్తున్నారని తెలిపారు. యాత్రలో ప్రయాణికులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి అల్పాహారం వండుటకు వీలుగా వంట సామాగ్రి తో పాటు వంట మనిషి ,హెల్పర్లు కూడా పంపుతున్నట్లు తెలిపారు. బస్సులో ప్రయాణికుల సౌకర్యార్థం ఫస్ట్ ఎయిడ్ కిట్టు కూడా అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ యాత్ర 13 రోజులు ఉంటుందని దానికి ఒక టికెట్టు 13,500 రూపాయలుగా నిర్ణయించామని తెలిపారు. త్వరలో శివరాత్రి కాశీ యాత్ర బస్సు టికెట్లను ఆర్టీసీ డిపో అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు.

### ఈ నెల 16న గోరింటలో చినరామాలయం వద్ద ఏకాహాం

– భజన సంఘం సభ్యులు పచ్చిపాల



పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ : పెద్దాపురం మండలం గోరింట గ్రామంలో స్వస్తిశ్రీ ఛాంద్రమాన శ్రీ శోభాకృత్ నామ సంవత్సర మాఘ మాసం శుద్ధ సప్తమి (రథసప్తమి) శుక్రవారంనాడు చిన రామాలయం వద్ద (శెట్టిబలిజ రామాలయం) 10వ వార్షికోత్సవంలో భాగంగా రథ సప్తమి పర్వదినం పురస్కరించుకుని ఏకాహం భజన కార్యక్రమం నిర్వహించబడునని, శ్రీ శివరామ బాలభక్త భజన సమాజం అధ్యక్షులు పచ్చిపాల ప్రసాదరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తెలుపుతూ గ్రామ పురోహితులు గోవిందవర్జుల శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో శెట్టిబలిజ సంక్షేమ సంఘం, గ్రామ ప్రజలు, భక్తుల సహకారంతో ఈ ఏకాహం నిర్వహించబడునని, దీనిలో భాగంగా శుక్రవారం ఉదయం 5 గంటలకు పూజా కార్యక్రమాలతో ప్రారంభమై ఉదయం 6 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకు ఈ ఏకాహం జరుగునని, దీనిలో శ్రీ శివరామ బాలభక్త భజన సమాజం, ఓంశక్తి మహిళా భజన సమాజం, శ్రీ షిరిడి సాయి మహిళా భజన సమాజం, విరవ, వడ్లమూరు, రాగంపేట, గుడివాడ, వివిధ గ్రామాల భజన సమాజాలు పాల్గొననున్నాయని పచ్చిపాల ప్రసాదరావు తెలిపారు.